నమ్మలేని నిజాలు

పండు ముసలి
కష్ట సుఖాల రేడు
చరిత్ర పుట

అస్తిత్వ వాదం
సామాన్యుల నిర్వేదం
రాజాధికారం

ఇసుకనది
వికృతాకార దృశ్యం
ప్రకృతి క్రీడ

బంధాలు దూరం
సెల్ ఫోనులో మునుక
జేబులో మిత్తి

దీపం వెలిగిన
ఆ ఘనులు మారరు
దివాంధ మతుల్

- రేడియమ్
సెల్: 9291527757

నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

శ్రీనిజాలు

ధనభవనం కుప్పకూలె
దీర్ఘకాల అనుభవాలు!
అహంభావ ప్రతిఫలమే
ఘోరంగ పరాభవాలు !

బీజేపీ నాయకుడే
రాజేందరే ఈటలా !
అడ్డంకులెన్ని ఉన్నా
పొంగివచ్చే ఊటలా !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ | గురువారం 4-11-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 73 | పేజీలు:4 | వెల: రూ.1/-

అండగా ఉంటాం.. ఆ చిన్నారికి మంత్రి కేటీఆర్ పరామర్శ

హైదరాబాద్ : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలో ఆరేండ్ల చిన్నారిపై జరిగిన అత్యాచార ఘటన అత్యంత బాధాకరమని మంత్రి కేటీఆర్ అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను, కుటుంబ సభ్యులను కేటీఆర్ పరామర్శించారు. సమాజంలో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమని, నిందితుడు ఎవరైనా కఠిన శిక్షపడాల్సిందేనన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పాపకి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు కేటీఆర్ సూచించారు.

దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి: హరీష్

హైదరాబాద్: సిద్దిపేట జిల్లా ప్రజలకు దీపావళి పర్వదినం సందర్భంగా మంత్రి హరీష్ రావు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడారు.

చీకటిని పారద్రోలి వెలుగునిచ్చే దీపావళి పర్వదినం ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి అని ఆకాంక్షించారు. ఈ పర్వదినాన్ని వేడుకగా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, చిన్నపిల్లలు కాకరొత్తులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆ లక్ష్మీ నారాయణుని అనుగ్రహముతో అందరికి శుభం చేకూరాలని, సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని ప్రార్థించారు.

వ్యాక్సినేషన్‌పై జిల్లా కలెక్టర్లతో ప్రధాని సమీక్షా సమావేశం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ కొవిడ్ వ్యాక్సినేషన్ నిదానంగా సాగుతున్న జిల్లాల మెజిస్ట్రేట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా 40 జిల్లాలు వ్యాక్సినేషన్ ప్రక్రియలో వెనుకబడి ఉన్నాయి. ఈ 40 జిల్లాల్లో మొదటి డోస్ తీసుకున్న వారి సంఖ్య 50 శాతం కూడా దాటలేదు. ఇక రెండో డోస్ కూడా చాలా తక్కువగా స్థాయిలో పూర్తయింది. దాంతో ఆ 40 జిల్లాల కలెక్టర్‌లతో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు.

వ్యాక్సినేషన్‌లో వెనుకబడ్డ ఆ 40 జిల్లాలు జార్ఖండ్, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, మేఘాలయా రాష్ట్రాల్లో ఉన్నాయని ప్రధాన మంత్రి కార్యాలయం తెలిపింది. అందుకే ప్రధాని మోదీ జీ-20, కాప్-26 సదస్సుల్లో పాల్గొని విదేశాల నుంచి తిరిగి రాగానే వ్యాక్సినేషన్‌పై ఆయా జిల్లాల అధికారులతో సమావేశమయ్యారు. వ్యాక్సినేషన్‌ను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా 10.34 కోట్ల మంది గడువు ముగిసినా సెకండ్ డోస్ తీసుకోలేదని ఇటీవల కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుక్ మాండవీయ చేసిన ప్రకటన కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చింది.

బంతికో రేటు.. వేశారు సంకెళ్లు.!

శేరిలింగంపల్లి, నవంబర్ 2 : టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లపై బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి 36.5 లక్షల విలువజేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన బుకీలు ముగ్గురు పరారీలో ఉన్నారు. గచ్చిబౌలి డీసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాదాపూర్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర (పూణే)కు చెందిన కాశీప్ ఉమెర్ అలియాస్ కాశీప్ అన్సారీ నగరంలోని ధూల్‌పేట్ మంగళ్‌హట్ ప్రాంతానికి చెందిన చంద్రపాల్ అలియాస్ పాల్, అజార్ అలియాస్ అజ్జులు ప్రధాన బుకీలుగా వ్యవహరిస్తున్నారు.

మంగళ్‌ఘట్ ప్రాంతానికి చెందిన ధరమ్‌సింగ్(44), సీతారాంబాగ్‌కు చెందిన అశీష్ కాలియా(36), జుమ్మెరత్‌బజార్‌కు చెందిన మనోజ్‌కుమార్(42), యోగేశ్ సింగ్ (22), అఫ్జాపురాకు చెందిన అరుణ్‌కుమార్ శర్మ(41), ధూల్‌పేట్‌కు చెందిన మహేందర్ సింగ్ (34), రాజాస్థాన్ జైపూర్‌కు చెందిన కమల్‌కుమార్ మీనా(32) ముఠాగా ఏర్పడి క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం గచ్చిబౌలి టీఎన్జీవోస్ కాలనీలోని విహంగ్ కో లీవింగ్ పీజీ హాస్టల్‌లో గదిని (నం.204) రోజుకు రూ.800చొప్పున నెలరోజుల పాటు అద్దెకు తీసుకున్నారు.

లీవ్, లైన్ గురూ, క్రికెట్ బజ్, క్రికెట్ మజా యాప్‌ల ద్వారా టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా సోమవారం రాత్రి ఇంగ్లాండ్, శ్రీలంక మధ్య జరిగిన మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ ఎస్ఓటీ, గచ్చిబౌలి

పోలీసులు రాత్రి 10:30 గంటల ప్రాంతంలో హాస్టల్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న గదిపై దాడిచేశారు. ధరమ్‌సింగ్, అశీష్ కాలియా, మనోజ్‌కుమార్, యోగేశ్ సింగ్, అరుణ్‌కుమార్ శర్మ, కమల్ కుమార్ మీనా, మహేందర్ సింగ్‌లను అదుపులోకి తీసుకున్నారు.

వారి వద్ద నుంచి రూ.15.10 లక్షల నగదుతో పాటు 11స్మార్ట్ ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు, రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్, కియా కారు, సుజుకీ జూపిటర్ వాహనం, బెట్టింగ్ నిర్వహించే కమ్యూనికేటర్ బోర్డు మొత్తం 36.50 లక్షల విలువజేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

పెట్రో భారం బతుకు ఆగం

పెట్రోలు, డీజిల్ ధరలు రోజురోజుకు దడ పుట్టిస్తున్నాయి..సామాన్యుల జీవితాలను ఆగం చేస్తున్నాయి..ఆర్థికస్థితిగతులను ఛిద్రం చేస్తున్నాయి..నెలవారి బడ్జెట్ తలకిందులవుతోందని వేతన జీవులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు నడుపాలంటే భయపడే రోజులొచ్చాయి. అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావం సరుకు రవాణాపై పడడంతో నిత్యావసర వస్తువులు, కూరగాయలు భగ్గుమంటున్నాయి. ఇప్పటికే కరోనాతో ఆర్థికంగా చితికిన వారు పెరిగిన ధరలతో మరింత దిగజారుతున్నారు.

ఇప్పుడిప్పుడే వ్యాపారాలు పుంజుకుంటుండగా, పెట్రో బాంబుతో వ్యాపారం తగ్గుముఖం పడుతున్నదని యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఇంధన ధరల మోతతో ఆటోలు, విద్యాసంస్థల వ్యాన్లు, క్యాబ్ ధరలు పెంచడంతో తిరిగే పరిస్థితి లేకుండా పోతున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు ప్రియం కావడంతో నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీనిపై ఆధారపడిన లక్షలాదిమంది పరిస్థితి తలకిందులయ్యే అవకాశముంది. పెట్రో దారిలో వాణిజ్య సిలిండర్ ధర కూడా భగభగమంటుండడంతో ఆహార పదార్థాలు, తినుబండారాల ధరలు అమాంతం పెరిగాయి.

తడిసిమోపెడు : దీపావళి అంటేనే పటాకుల పండుగ. చిన్నాపెద్ద కలిసి ఆనందంగా జరుపుకునే వేడుక. డీజిల్ ధర అమాంతం పెరగడంతో పటాకుల మోత ఈసారి పెద్దగా వినిపించేలా లేదు. రవాణా చార్జీలు తడిసి మోపెడవుతుండడంతో పటాకుల ధరలు 20 నుంచి 30 శాతం పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. ఫలితంగా గ్రీన్ క్రాకర్లకు డిమాండ్ పెరుగుతున్నదని పేర్కొన్నారు. కాలుష్య రహితంతోపాటు తక్కువ శబ్దం రావడం గ్రీన్ క్రాకర్ల ప్రత్యేకత.

రోజు రోజు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు సామాన్యుల జీవనాన్ని ఛిద్రం చేస్తున్నాయి. ఇలాపెరుగుకుంటూ పోతున్న ధరలతో సామాన్యుడి పూట గడవడం గగనంగా మారింది. దీంతో అర్ధాకలితో బతకాల్సిన పరిస్థితులు చాలా కుటుంబాల్లో ఏర్పడ్డాయి. ఈ పెరిగిన ధరలు అన్ని రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సామాన్యుడి నుంచి వ్యాపారుల వరకు ఆర్థికంగా కుదేలవ్వాల్సిన దుస్థితి నెలకొన్నది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో నిర్మాణ రంగం విస్తృతంగా సాగుతుంది. అయితే 15-20 రోజులుగా నిర్మాణ సామగ్రి ధరలు ఒక్కసారిగా పెరిగాయి. కొన్నిరోజుల కిందటి వరకు స్టీలు ధర టన్నుకు రూ.62-68 వేల (మంచి కంపెనీ) వరకు ఉండగా%%% రూ.57-58వేలు (లోకల్ కంపెనీలు) వరకు ఉండేవి. కానీ ఇప్పుడు టన్నుకు రూ.6 వేల నుంచి రూ. 10 వేల వరకు పెరిగింది. 53 గ్రేడ్ సిమెంటు బస్తా రూ.350-360 ఉండేది. సాధారణ కంపెనీలవి బస్తా రూ.300 వరకు ఉండేవి. ఇప్పుడు ఒక్కో బస్తాపై కనీసంగా రూ.50-80 వరకు పెరిగాయి. ఫలితంగా నిర్మాణ అంచనాల్లో లక్షల రూపాయల భారం పెరిగిపోతుందని నిర్మాణదారులు వాపోతున్నారు.

సామాన్యుడికి కూర'గాయాలు' : మార్కెట్లో కొద్ది రోజులుగా కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. రూ. 500 నుంచి రూ. వెయ్యి పెడితేగాని వారానికి సరిపడా కూరగాయలు రావడం లేదు. పెట్రో, డీజిల్ ధరలు పెరగడంతో రైతులకు మార్కెట్‌కు కూరగాయాలు తీసుకురావడం భారంగా మారింది. డిమాండ్ మేరకు సప్లయ్ కాకపోవడం వల్లే ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. గడిచిన నెల రోజుల్లో కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి.

తల్లిదండ్రులపై 'పెట్రో' భారం : గ్యాస్, పెట్రో ధర మంటలు స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. కరోనాతో ఏడాదిన్నరగా పాఠశాలలు మూతపడ్డాయి. పూర్తిస్థాయిలో గత నెలలోనే స్కూల్స్ తెరుచుకోవడంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలకు తల్లిదండ్రులు తమ పిల్లలను పంపిస్తున్నారు. చాలా మంది ప్రైవేట్ విద్యార్థులు ఆటోలు, వ్యాన్లు, స్కూల్ బస్సులలో వెళ్లివస్తుంటారు. గతంలో సుమారు 3 నుంచి 4 కిలోమీటర్ల పరిధిలో ఉండే స్కూల్‌కు ఒక్కొక్కరు ఆటోకు వెయ్యి రూపాయల వరకు చెల్లించే వారు. ప్రస్తుతం రూ.1500 తీసుకుంటున్నారు. అదే వ్యాన్‌కైతే గతంలో రూ.1200 ఉన్నది ఇప్పుడు రూ. 2 వేలకు పెరిగింది.

క్యాబ్ వచ్చేనా..? : ఇంధన ధరలు పెరుగుదల క్యాబ్ సర్వీస్‌లపై ప్రభావం చూపుతోంది. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల కారణంగా క్యాబ్‌లను నడపలేని పరిస్థితి ఉందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పరోక్షంగా కస్టమర్లు నష్టపోతున్నారు. క్యాబ్ బుకింగ్ పూర్తయిన అనతరం డ్రైవర్లు ఆ రైడ్‌ను రద్దు చేస్తుండటంతో కస్టమర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ పేమెంట్స్ కారణంతో కూడా డ్రైవర్లు ఆ ట్రిప్పును రద్దు చేస్తున్నారు. దీంతో కొంతకాలంగా ఓలా, ఊబర్ క్యాబ్ సర్వీస్‌లో అంతరాయం నెలకొంది. ఫలితంగా నిమిషాల వ్యవధిలో క్యాబ్ బుక్ కావాల్సిన ట్రిప్పు.. అరగంట సమయం ప్రయత్నించినా సర్వీస్ కనెక్ట్ కావడం లేదు. దీంతో కస్టమర్లు క్యాబ్‌సర్వీస్‌లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఉత్సాహంగా దీపావళి పండగ చేసుకుంటారు. రంగు రంగుల బాణాసంచా కాలుస్తూ పిల్లలు చేసే సందడి అంతా ఇంతా కాదు.. ప్రతి ఇంటా కొత్త కాంతులు నింపే ఈ పండగ.. ఈ ఏడాది మండుతున్న బాణాసంచా ధరలతో డీలా పడిపోయింది. కొవిడ్ భయంతో చాలా మంది వ్యాపారంపై ఆందోళన చెందుతుండగా, పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో రవాణా చార్జీలు తడిసి మోపెడయి.. ఆ ప్రభావం బాణాసంచా వ్యాపారంపై పడింది. ఫలితంగా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధరలు 20 నుంచి 30 శాతం పెరిగాయని వ్యాపారులు అంటున్నారు.

భగ్గుమన్న గిఫ్ట్ ప్యాక్ ధర : ఒకరిద్దరు చిన్న పిల్లలున్న ఇంట్లో గిఫ్ట్ ప్యాక్ తెచ్చుకుంటారు. దీని కోసం రెండు, మూడు రకాల గిఫ్ట్ ప్యాక్‌లు ఆయా బాణాసంచా కంపెనీలు తయారు చేస్తాయి. రకాలను బట్టి ధర ఉంటుంది. వీటి ధరలు ఈసారి భగ్గుమంటున్నాయి. గత ఏడాది రూ.500 ఉన్న చిన్న గిఫ్ట్ ప్యాక్ ధర ఈ ఏడాది రూ.650 నుంచి రూ.750 వరకు అమ్ముతున్నారు. అదే పెద్ద ప్యాక్ ధర రూ. 900ల నుంచి రూ.1200లకు పెరిగింది.

పట్టణీకరణ అంటే మురికివాడలు పెరగడమేనా?

(ఐరాస సస్టేనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్-2030లోని 'సుస్థిర నగరాలు, నగర సమూహాలు' అనబడే లక్ష్య నివేదిక-2021 ఆధారంగా)

2015లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీసుకున్న ఏకగ్రీవ తీర్మానం ప్రకారం '2030 నాటికి ప్రపంచవ్యాప్త సానుకూల సుస్థిరాభివృద్ధి మార్పులు' చేపట్టాలనే సదుద్దేశంతో 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030లను ఐక్యరాజ్యసమితి నిర?యించారు. ఈ 17 లక్ష్యాలను '2030 ఎజెండా' అని కూడా పిలుస్తాం. పేదరికం, ఆకలి చావులు, ఆరోగ్యం, విద్య, పర్యావరణ మార్పులు, లింగ సమానత్వం - మహిళా సాధికారత, సురక్షిత నీరు, పారిశుధ్యం, శక్తి వనరులు, పట్టణీకరణ, భూతాపం, పారిశ్రామికీకరణ, ఆవిష్కరణలు, మౌళిక సదుపాయాలు, సామాజిక న్యాయం లాంటి ప్రధాన అంశాలను తీసుకొని 2030 నాటికి ప్రగతి సాధించాలని లక్ష్యంగా తీసుకున్నారు. సామాజిక అభద్రత, అసమానతలు, పేదరికం, లింగ భేదం, ఆకలి చావులు, నిరుద్యోగం లాంటివి సుస్థిరాభివృద్ధికి ప్రతిబంధక సంబంధాన్ని కలిగి ఉంటాయి. గత దశాబ్దకాలంగా విద్యారంగంలో ప్రపంచ మానవాళి ఎంతో ముందడుగు వేసినా ఊహించనంతగా అభివృద్ధి అడుగులు పడలేదనే చెప్పాలి. కరోనా కల్లోలంతో ఎజెండా-2030 లక్ష్యాల సాధన మరో కఠిన ప్రశ్నగానే మిగిలిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 11వ అంశంగా 'సుస్థిర నగరాలు, నగర సమూహాలు (సస్టేనబుల్ సిటీస్ అండ్ కమ్యునిటీస్)'ను ముఖ్యమైనదిగా తీసుకొని పలు సూచనలు చేసింది.

2007 నుంచి పట్టణీకరణ పెరుగుతూ దాదాపు 50 శాతం జనాభా, అనగా దాదాపు 4 బిలియన్లు నగరాలకు చేరడం జరుగుతోంది. 2030 నాటి ప్రపంచ పట్టణ జనాభా 60 శాతానికి, అనగా 5 బిలియన్లకు చేరవచ్చని అంచనా. నగరాలు, మెట్రో ప్రాంతాలు ఆర్థికాభివృద్ధి కేంద్రాలుగా 60 శాతం జిడిపికి కారణం అవుతున్నప్పటికీ నగరాలు కాలుష్య కేంద్రాలుగా, మురికి కూపాలుగా మారుతుండడం చూస్తున్నాం. నగర ప్రజల్లో 90 శాతం గాలి కాలుష్యం బారిన పడుతున్నారని ఐరాస తేల్చింది. కరోనా కేసుల్లో 90 శాతం నగరాల్లోనే నమోదు అవడం మనకు విధితమే. భూమిలో 3 శాతం మాత్రమే ఆక్రమించిన నగరాలు 60-80 శాతం శక్తి వనరులను వాడుకుంటూ 75 శాతం కార్బన్ ఉద్గారాలకు కారణం అవుతున్నాయి. నగర విస్తరణ పరిస్థితులు ఇలాగే నిర్లక్ష్యం చేసే అభద్రత, అశాంతి, అనారోగ్యాలు, కాలుష్యం లాంటి తీవ్ర అవస్థలు అనుభవించాలి. 2016 వివరాల ప్రకారం గాలి కాలుష్యంతో నగరవాసుల్లో 4.2 మిలియన్ల అకాల మరణం పొందారని అంచనా వేశారు.

మార్చి-2020 నుంచి మహానగరాలు, పట్టణాలు కరోనా కేంద్రాలుగా భయానక వాతావరణాన్ని సృష్టించాయి. సురక్షిత నీరు, గృహవసతులు, ప్రజారోగ్య సదుపాయాలు, రోడ్లు, ప్రజారవాణ, మౌళిక వసతులు, పారిశుధ్యం, మురికి నీటి వ్యవస్థలు, ఆట స్థలాలు, పబ్లిక్ గార్డెన్లు లాంటి సౌకర్యాల తీవ్ర కొరతతో నగర జీవితం నరక ప్రాయం అవుతున్నదని మనకు తెలుసు. దీనికి తోడుగా ఆర్థిక, సామాజిక, లింగ, రాజకీయ అసమానతల నడుమ బడుగుల బతుకులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా నగర మురికి వాడలు లేదా స్లమ్స్ జనాభా (దాదాపు ఒక బిలియన్) 2014 మరియు 2018 మధ్యలో 23 శాతం నుంచి 24 శాతానికి పెరగడం గమనించారు. మురికి వాడల్లో జీవించే జనాభా అత్యధికంగా ఆసియాలో 596 మిలియన్లు, ఆఫ్రికాలో 238 మిలియన్లు ఉన్నట్లు తేలింది. మురికివాడల్లో జీవిస్తున్న అభాగ్యుల ఉన్నతికి సంబంధించిన పట్టణ ప్రణాళికలు, ఆర్థిక కేటాయింపులు, పాలసీలు, జీవన ప్రమాణాన్ని పెంపొందించే చర్యలు నేటికీ అరకొరగానే నత్తనడకన కొనసాగుతున్నాయి.

పట్టణీకరణ అస్తవ్యస్తంగా విస్తరించడం, రోడ్లు, రవాణా వసతులు కొరవడడంతో పేదల కాలనీలు మురికి కూపాలవలె తయారవడం చూస్తున్నాం. 2019 వివరాల ప్రకారం 95 దేశాలకు చెందిన 610 నగరాల అధ్యయనంలో ప్రపంచ జనాభాలో 50 శాతం మాత్రమే 1 కిలోమీటర్ల లోపు దూరంలో రైలు/బస్సు లాంటి ప్రజారవాణా సౌకర్యాలను కలిగి ఉన్నారని తేలింది. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో 32-34 శాతం జనాభాకు మాత్రమే సమీపాన ప్రజారవాణ కల్పించబడింది. 2020లో చేసిన అధ్యయనంలో 114 దేశాలకు చెందిన 911 నగరాల వివరాల ప్రకారం పట్టణాల్లో 16 శాతం భూమి మాత్రమే రోడ్లు, పార్కులు, ఆటస్థలాలకు (పబ్లిక్ స్పేసెస్) కేటాయించబడినవి. ఐరాస ప్రమాణాల ప్రకారం 30 శాతం నగర భూమి రోడ్లకు, మరో 10-15 శాతం పార్కులు, క్రీడా మైదానాలకు కేటాయించాలి. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో 12-14 శాతం మాత్రమే పబ్లిక్ స్పేసెస్ అందుబాటులో ఉన్నాయి. మార్చి-2021 నాటికి 156 దేశాల్లో సకారాత్మక నగరాభివృద్ధి పాలసీలు అమలు అవుతున్నాయని తేలింది.

పట్టణాభివృద్ధి ప్రణాళికాబద్ధంగా జరగాలి. భవన నిర్మాణాలు, మురుగు నీటి వ్యవస్థలు, రోడ్లు, ప్రజారవాణ వ్యవస్థలు, పార్కులు, క్రీడా మైదానాలు, సురక్షిత త్రాగు నీరు, ప్రజారోగ్య కేంద్రాలు, హరిత వనాలు లాంటి సౌకర్యాలకు అధిక ప్రాధాన్యతలను ఇవ్వాలి. నగరాభివృద్ధిలో ప్రతి పౌరుడు పాలుపంచుకోవాలి. అధిక జనాభా కలిగిన భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో రాబోయే దశాబ్దంలో అధిక శాతం పట్టణీకరణ జరుగవచ్చని తేల్చడంతో దానికి సమానంగా మౌళిక వసతుల కల్పనకు కృషి జరగాలి. 2050 నాటికి ప్రపంచ జనాభాలో 70 శాతం నగర ప్రాంతాలకు వలసలు జరగవచ్చని ఐరాస హెచ్చరిస్తున్నది. ప్రభుత్వాలు రాబోయే పట్టణీకరణను దృష్టిలో ఉంచుకొని నగరాభివృద్ధిని దూరదృష్టితో చేపట్టుటకు ప్రాధాన్యతను ఇవ్వాలి. మహానగరాలు నందన వనాలుగా, పట్టణాలు నివాసయోగ్య ఆవాసాలుగా రూపొందాలని, ఈ మహాయజ్ఞంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరుకుందాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
- 9949700037

ఉమ్మడిశెట్టి సత్యాదేవి
సాహితీ అవార్డు - 2021

కవులకు విజ్ఞప్తి

34వ ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు - 2021 కోసం
కవుల నుండి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము.

అవార్డు పరిశీలన కోసం 2021 లో
ప్రచురింపబడిన కవితా
సంపుటాలను మాత్రమే పంపాలి.

ఎంపికైన ఉత్తమ కవితా సంపుటికి
ఆరువేల నగదు మరియు షీల్డ్ తో కవికి సత్కారం ఉంటుంది

05.01.2022 తేదీలోగా నాలుగు ప్రతులను
ఈ క్రింది చిరునామాకు పంపాలని విజ్ఞప్తి చేస్తున్నాము

డా. రాధేయ
చైర్మన్- ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్
13-01-606-1 షిర్డీనగర్, రెవిన్యూ కాలనీ,
అనంతపురం - 515001
సెల్: 9985171411

చరిత్రలో నేటినిజం

కం॥ భీతి భవమును కనిపించెడి
పావనమగు పాత్రలు తెర పై నిలుచు నటుల్
శ్రీవిభవ రాజేంద్రుడు
కావించెను చిత్రములను కైమోడ్పు గావన్ !!

[నవంబరు 4 : సినీనట విభవ రాజేంద్రప్రసాద్ జయంతి]

-రాధశ్రీ
సెల్: 9494481210

అక్షర కండెలతో కవితామగ్గం నేస్తున్న యెల్ది

అతడు అక్షరాలను కలం కండెలోకి ఎక్కించి కవితామగ్గం నేస్తున్న అక్షరశ్రామికుడు.
పదాలను నూలుపోగులా చుడుతూ సాహిత్యచీరను నేస్తున్న కలంకారి.
రంగురంగుల కవితాచిత్రాలను ఆవిష్కరిస్తూ జరీఅంచు చీరలను వెలిగిస్తున్న పట్టుకాగితం.

అతడు యెల్ది సుదర్శన్.
తెలంగాణ అక్షరబీజాలను మహారాష్ట్రలో వెలిగిస్తున్న అక్షరదీపం.
నిరంతరం సాహిత్యమగ్గాన్ని నేస్తూ పదాలతో పట్టుచీరను ఆవిష్కరిస్తున్న కవితారాట్నం.
ఇపుడు ముంబై తెలుగు సాహిత్యరంగంలో యెల్ది సుదర్శన్ ది చెరగని ముద్ర.
ఎప్పుడో కవిత్వం రాసుకుని, దానిని ఏళ్లుగా భద్రంగా దాపెట్టుకుని వయసుతో పాటుగా కవిత్వం పరిపక్వం దశకు చేరుకున్న దశలో కవితాదీపాన్ని వెలిగించిండు. సంవత్సరాల తరబడి తన కవితాక్షరాలను నానబెట్టి, ఆరబెట్టి అనంతరం పుస్తకాలుగా ఆవిష్కరించి సాహితీ ఆకాశంలో రెపరెపలాడిస్తున్నడు. ఇప్పటికీ పది పుస్తకాలను సాహితీ లోకానికి అందించిండు. 2005 సంవత్సరంలో మొట్టమొదటి కవితాసంపుటి "ఉదయకిరణాలు" పేరుతో వెలువరించి తెలుగు సాహిత్య ప్రపంచంలోకి నెలబాలుడిగా ప్రవేశించిండు. ఆ తర్వాత "యెల్ది ముత్యాలు, యెల్ది కవిత, యెల్ది రత్నాలు, కలిసిన హృదయాలు, యెల్ది పగడాలు, యెల్ది మాణిక్యాలు, యెల్ది వైఢుర్యాలు, యెల్ది నీలాలు" వంటి కవితాసంపుటాలను వెలువరించిండు. ఇంకా "గూఢచారి వదిన" కథా సంకలనాన్ని, "మాధవి ఐపీఎస్, ప్రేమాంజలి" వంటి నవలలను రచించిండు.
తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన యెల్ది సుదర్శన్ ముంబై నగరానికి వ్యాపార నిమిత్తం వలసవోయిండు. ఒకపక్క వ్యాపారం చేసుకుంటూనే మరోపక్క సాహిత్యం మీద అభిరుచితో రచనారంగం వైపు దృష్టి సారించిండు. అట్లా యెల్ది సుదర్శన్ ఒకవైపు తనదైన జీవితాన్ని గడుపుతూనే మరొకపక్క సాహిత్య ప్రపంచంలోకి అడుగులు వేసిన నిత్యచైతన్య కవితాధార. యువకుడిగా ఉన్నప్పటి నుంచి వివిధ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నడు.
యెల్ది రచించిన అనేక రచనలు వివిధ దిన, వార, మాసపత్రికలలో ప్రచురితమైనవి.

తన డెబ్బై ఐదవ వసంతం పూర్తిచేసుకుని ఈ నెల 11న యెల్ది సుదర్శన్ పద్మశాలి రచించిన 'ప్రేమాంజలి' సామాజిక నవల, "యెల్ది నీలాలు' కవిత్వం పుస్తకాల ఆవిష్కరణ సందర్భంగా)

సామాజిక మాధ్యమాలలో ప్రసారమైనవి. ఆకాశవాణిలో అనేకసార్లు కవితా, గేయ పఠనాలను చేసిండు.

సంస్థల నిర్వాహకుడు

ఒకపక్క సాహిత్యంలో అనేక రచనలు చేస్తూనే మరోవైపు యెల్ది సుదర్శన్ పలు సంస్థల ఆధ్వర్యంలో అనేక సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను చేపట్టిండు. వివిధ సంస్థలకు అధ్యక్షుడిగా వ్యవహరించారు. అఖిల భారతీయ పద్మశాలి సాహిత్య విభాగ సంఘానికి చైర్మెన్ గా, ముంబై ప్రాంతీయ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శిగా, ఓం పద్మశాలి సేవా సంఘం ట్రస్టీగా పలు సేవలందించిండు.

వరించిన అవార్డులు

సాహిత్యరంగంలో అనేక రచనలు చేసిన యెల్ది సుదర్శన్ కు వివిధ సాహిత్య, సాంస్కృతిక సంస్థలు అనేక అవార్డులను అందజేశాయి. తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, సుభాష్ చంద్రబోస్ అవార్డు
(జాగృతి కిరణ్ ఫౌండేషన్, నాగపూర్), పింగళి వెంకయ్య పద్మరత్న అవార్డు (నీలగిరి దినపత్రిక, నల్గొండ), డాక్టర్ అందె వెంకటరాజం స్మారక సాహిత్య పురస్కారం (భారతీ సాహిత్య సమితి, కోరుట్ల), కిన్నెర ఉగాది పురస్కారం (కిన్నెర ఆర్ట్స్, హైదరాబాద్), తెలుగు భాషా పురస్కారం (తెలుగు రక్షణ వేదిక), పుస్తక తపస్వి పురస్కారం (శ్రీపాద సాహిత్యపీఠం, నిజామాబాద్), ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సాహిత్య పురస్కారం(పద్మదర్శిని, నల్గొండ), ఆర్వీ సాహిత్య పురస్కారం (తెలంగాణ సారస్వత పరిషత్, హైదరాబాద్), స్వామి వివేకానంద అవార్డు (యువకళావాహిని, హైదరాబాద్), మోర్తాడ్ రత్న పురస్కారం (మోర్తాడ్ పద్మశాలి సంఘం, ముంబై), మానస ఉగాది పురస్కారం (మానస సాహిత్య సాంస్కృతిక సమితి, విజయవాడ), భాషా ప్రవీణ పురస్కారం (భావన సాహిత్య సమితి, నిజామాబాద్), చతుర కవి పురస్కారం (రావికంటి వసునందన్ సాహిత్య కళాపీఠం, హైదరాబాద్), తెలంగాణ సాహిత్య పురస్కారం (సాహిత్య మేఖల, నల్లగొండ), మూడా నాగభూషణం తెలంగాణ సాహిత్య పురస్కారం (బాసర), ఇందూరు అపురూప పురస్కారం (నిజామాబాద్) తదితర పురస్కారాలెన్నో యెల్ది సుదర్శన్ అందుకున్నరు. ఇంకా వివిధ కవిసమ్మేళనాలు, సాహిత్య సదస్సులలో పాల్గొని పలువురి ప్రముఖులచే సత్కారాలను అందుకున్నడు.
నిరంతరం సాహిత్యసేవలో తరిస్తున్న యెల్ది సుదర్శన్ భవిష్యత్తులో మరిన్ని సామాజికోపయోగ రచనలు చేస్తారని అభిలషిస్తున్నాను.

- భీంపల్లి శ్రీకాంత్
9032844017

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 4-11-2021

ఘంటారావం

మాటకు కట్టుబడి ఉంటే
ఇంటికి ఇరుసవుతారు
మూటనే ముఖ్యమనుకుంటే
కంటికి నలుసవుతారు

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

నేటికవిత-కవిత్వ విశ్లేషణ

నేటికవితలో ఈ వారం: 'నేను నా నీడ'
అనే అంశంపై వచ్చిన కవితల్లోంచి ఓ మూడు కవితలపై విశ్లేషణ



నింగికి నేలలా

నేను నిక్షేపిగా పోయలేదు గాని
వాడు నాలో మొలిచిన చీకటి మొక్క
అచ్చం నాలానే కొమ్మలేసి నడుస్తాడు
వాడు మూడడుగుల బోటేమీ కోరడు గాని
మిడి మిడి ఎండకు వామనుడై
వద్దన్నా వినకుండా వెంబడిస్తాడు
వాడు వరాలేమీ ఇవ్వడు గాని
నా విశ్వరూపాన్ని నిలబెట్టి
మహాపురుషునిలా ముందుకొచ్చి
మురిపిస్తాడు
వాడు కూలేమీ అడగడు గాని
నిత్యం నా పనే నాకు నేర్పుతూ
చెమటపట్టని పనోడై చెంత ఉంటాడు
వాడికి నటనేమీ రాదు గాని
కొన్ని సార్లు గోడెక్కి
నా అభినయాన్ని నా కళ్లకు కడతాడు
నన్ను ఒంటరిగా ఒడిసాలని
వెతికే వెలుతురు కిరణానికి
విసుగు తెప్పించే వెన్నెల చెలికాడు
నా కన్నీళ్ల తడికి తడసక
నా సంతోషాల జడికి పొంగక
నా ధ్యానంలోనే మునిగిన యోగిపుంగవుడు
అప్పుడప్పుడు మేమిద్దరం
మనసువిప్పి మాట్లాడుకుంటాం
మాటకు మాట విసురుకుంటూ కాదు సుమా
నింగికి నేలలా బదులిస్తూ..!
నాతో నడిచే వాడు
నన్ను నట్టేట ముంచుతారేమో గాని
నా నీడైన వాడు మాత్రం
నిజాయితీకి నిలువెత్తు రూపం

- నల్లు రమేష్
9989765095

నెల్లూరు జిల్లా పోలిరెడ్డిపాలెం కు చెందిన కవి నల్లు రమేష్ గారు నేను నా నీడ అంశంపై నింగిని నేలలా శీర్షికతో రాసిన కవితలో నీడను.. నీడతో తమకు పెనవేసుకున్న బంధాన్ని కవితాత్మకంగా ఆవిష్కరించారు.

నేను నిక్షేపి పోయలేదు కానీ.. వాడు నాలో మొలిచిన చీకటి మొక్క అచ్చం నాలానే కొమ్మలేసి నడుస్తాడంటూ కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. నీడను నాలో మొలిచిన మొక్క అని అచ్చం నాలానే నడుస్తుందని చెప్పడంలో కవి యొక్క కలం బలం కనబడుతుంది. వాడు మూడడుగుల బోటేమీ కోరడు గాని మిడిమిడి ఎండకు వామనుడై వద్దన్నా వినకుండా వెంబడిస్తాడని చమత్కరించారు. సాధారణంగా వెన్నంటి ఉండి నడిచే అంశాన్ని కవిత్వాత్మకంగా చెప్పడంలో కవి రమేష్ గారు సఫలీకృతులైనారు.

వాడు అంటూ నీడను ఇలా ప్రస్తావించి కవి పాఠకులను మెప్పించారు. నా విశ్వరూపాన్ని నిలబెట్టి వాడు వరాలేమీ ఇవ్వడు గాని మహాపురుషునిలా ముందుకొచ్చి మురిపిస్తాడనీ.. నిత్యం నా పనే నాకు నేర్పుతూ చెమటపట్టని పనోడై చెంతనుంటాడని పేర్కొన్నారు. చెమట పట్టని పనోడై అన్న పదబంధాలు కవితలో చక్కగా ఒదిగిపోయాయి. వాడు కూలేమీ అడగడని చెప్పడంలోనూ కవి రమేష్ గారు ఔచిత్యాన్ని పాటించారు.

వాడికి నటనేమీ రాదుగానీ కొన్నిసార్లు గోడెక్కి నా అభినయాన్ని నాకళ్లకు కడతాడనీ.. నన్ను ఒంటరిగా ఒడిసిపట్టాలని వెతికే వెలుతురు కిరణానికి విసుగు తెప్పించే వెన్నెల చెలికాడు అంటూ కొనసాగించారు. నీడను కవి రమేష్ గారు కొత్తకోణంలో ఆవిష్కరించడం ఆస్వాదనీయం.

నా కన్నీళ్ల తడికి తడసక నా సంతోషాల జడికి పొంగక .. నా ధ్యానంలోనే మునిగిన యోగి పుంగవుడని నీడకు కితాబునిచ్చారు. అప్పుడప్పుడు ఇద్దరం మేము మనసు విప్పి మాటకు మాట విసురుకుంటూ కాదు సుమా! నింగికి నేలలా బదులిస్తూ అంటూ కవి తమ కవితాపటిమను ప్రదర్శించారు.

నాతో నడిచేవారు నన్ను నట్టేట ముంచుతారేమో గానీ నా నీడైనవాడు మాత్రం నిజాయితీకి నిలువెత్తు రూపం అంటూ ముగించారు. రమేష్‌గారు తమసృజనాత్మక ప్రతిభతో నీడను..తమదైన శైలిలో వర్ణించే ప్రయత్నం చేశారు. నీడను చీకటి మొక్కగా.. వామనుడిగా, మహాపురుషుడిగా.. చెమటపట్టని పనోడిగా, నటుడిగా, వెన్నెల చెలికాడుగా.. యోగి పుంగవుడిగా అభివర్ణించారు. వస్తువిశ్లేషణలో శిల్పం విషయంలో, పదబంధ ప్రయోగంలో కవి తమ ప్రతిభను అంశానికి తగ్గట్టు ప్రదర్శించడం ప్రశంసనీయం.

తానేగా తోడు

దేవుడిచ్చిన వరమే తాను
లోకమంతా ఏకమై నన్నేకాకిని చేసినా
తానెప్పుడూ వీడలేదుగా మరి...
ఆదరణెరుగని అంధకారదీవిలో
కుమిలిపోయినా
నాలోనే ఐక్యమై ఓదార్చిందే తప్ప
వెతల గోడల్లో బంధించి మాయమవలేదుగా మరి..
ఎవరితో కలవలేని ఆత్మన్యూనతతో వెక్కి వెక్కి
ఏడుస్తుంటే
ఆలోచనకు ఆకృతినిస్తూ వ్యక్తిత్వానికి
వన్నెలద్దిందే కాని
ఒంటరి వీధుల్లో నిలిపి తుంటరితనం
చూపలేదుగా మరి..
అలిగిన వేళ వింతచేష్టలతో గిలిపెడుతూ
అలసిన వేళ నా పరిశ్రమను నాకు చూపి ఉ
త్సాహపరుస్తూ
ఆటలెన్నాడుతుందో నా నీడ..
కడవరకు తోడుంటానని మాటిస్తూ
ఎడతెగని ఈ పయనంలో
ఎదనిండా సంతోషం
నింపుతూ

స్వప్నకృష్ణ
9989765095

హుజురాబాద్‌కు చెందిన కవయిత్రి స్వప్నకృష్ణ గారు నేను నానీడ అంశంపై తానేగా తోడు శీర్షికతో తమ జీవిత భాగస్వామే తోడు నీడ అన్న అర్థం ధ్వనించేలా కవితను రూపుదిద్దారు.

కవయిత్రి స్వప్నకృష్ణ గారు నీడను ఉన్నతంగా చిత్రించారు. దేవుడిచ్చిన వరమే తాను లోకమంతా ఏకమై నన్నేకాకిని చేసినా.. తానెప్పుడూ వీడలేదుగా మరి.. అంటూ కవితను ప్రారంభించిన తీరు బాగుంది. లోకమంతా ఏకమై తనను ఏకాకిని చేసినప్పటికీ.. నీడ తనెప్పుడూ వీడలేదని చెప్పడంలో కవయిత్రికి నీడతో తనకున్న బంధాన్ని గొప్పగా చెప్పేందుకు యత్నించారు.

ఆదరణెరుగని అంధకార దీవిలో కుమిలిపోయినప్పటికీ.. నాలోనే ఐక్యమై ఓదార్చిందే తప్పా వెతల గోడల్లో బంధించి మాయమవలేదుగా మరి.. అంటూ ప్రకటించడం బాగుంది. కవయిత్రి స్వప్నకృష్ణ గారు విశ్లేషించి పాఠకుల మెప్పించారు. ఎవరికీ కలవలేని ఆత్మన్యూనతలో వెక్కివెక్కి ఏడుస్తుంటే.. ఆలోచనకు ఆకృతినిస్తూ.. వ్యక్తిత్వానికి వన్నెలద్దిందే కాని ఒంటరి వీధుల్లో నిలిపి తుంటరితనం చూపలేదుగా మరి అంటూ నీడను మెచ్చుకున్నారు.

అలిగినవేళ వింతచేష్టలతో గిలిపెడుతూ.. అలసిన వేళ నా పరిశ్రమను నాకు చూపి ఉత్సాహపరుస్తుందని నీడను కొనియాడారు. నీడ తనతో కడవరకు తోడుంటానంటూ మాటిస్తూ ఆటలెన్నో ఆడుతుందనీ.. ఎడతెగని పయనంలో ఎదనిండా సంతోషం నింపుతూ అంటూ ముగించడం బాగుంది.

నీడను వినూత్నంగా ఆవిష్కరించడానికి కవయిత్రి స్వప్నకృష్ణ గారు సరళత్వానికి పెద్దపీట వేస్తూనే.. నర్మగర్భంగా తమ భావాలను కవితాత్మకంగా ప్రకటించడం ప్రశంసనీయం.. తోడు నీడగా జీవితభాగస్వామిని దేవుడిచ్చిన వరంగా వివరిస్తూ.. తానేగా తోడు అంటూ నీడను విభిన్నమైన కోణాల్లో ఆవిష్కరింపయత్నించారు. కవయిత్రి స్వప్నకృష్ణ గారు అంశం వెలుగులో ఔచిత్యవంతమైన శిల్పానికి చోటు కల్పిస్తూ కవితకు శోభను కూర్చారు.

ఆత్మరూపం

నాతోనే పుట్టి నాతోనే పెరిగే
నా ఆత్మరూపమే నా తోడు నీడ
నా ప్రతిరూపం తానై
నన్ను మనసున్న మనిషిగద
నిలబెట్టే అపురూప వరం..!!
ఏటవాలుగా తాను నడుస్తూ
నన్ను నిటారుగా నిలబెడుతూ
ఎగుడుదిగుడులను గమ్మున దాటేస్తూ
అడుగడుగునా నిరాశల నిప్పురవ్వలు
నాపై పడకుండా ఛాయాఛత్రమై
అక్కున చేర్చుకునే అమ్మఒడి తానే..!!
అంతరాత్మ అరవిందం తానై
తప్పొప్పుల తగాదాలకు
పరిష్కార పరిమళాలద్దుతూ
మలయసమీరపు ఓదార్పుల
వీవెనలు వీచే పూరేకుతానే..!!
ఆత్మలకు వెలుగు జిలుగులు పంచి
పరమాత్మలుగా నిలబెడుతుంది
అద్వైత భావనలకు అద్దం పడుతుంది
ఆఖరి క్షణాల్లో జీవాత్మగా వేరుపడి
అనంతలోకాలకు చేరుతుంది..
నా నీడగా తాను అజరామరం
అవుతుంది..!!



సావిత్రి రంజోల్కర్
9833497812

నవీముంబైకి చెందిన కవయిత్రి సావిత్రి రంజోల్కర్ గారు నేను నా నీడ అంశంపై ఆత్మరూపం శీర్షికతో రాసిన కవితలో తమ తాత్వికతను చాటుకున్నారు. నీడను ఆత్మరూపంగా పేర్కొంటూ అంశం వెలుగులో తమ భావాలను ఆవిష్కరింప యత్నించారు..

నీడ ఆత్మలకు వెలుగుజిలుగుల పంచి పరమాత్మలుగా నిలబెడుతుందనీ.. అద్వైత భావనలకు అద్దం పడుతుందని.. ఆఖరి క్షణాలలో జీవాత్మ వేరుపడి అనంతలోకాలకు చేరుతుందని పేర్కొన్నారు. నా నీడగా తాను అజరామరమవుతుందని ముగించారు.

కవయిత్రి సావిత్రి గారు నీడతో తమకున్న బంధాన్ని తమ కవితలో ప్రస్తావించిన తీరు బాగుంది. నీడ నాతోనే పుట్టి నాతోనే పెరిగి అంటూ కవితను ఎత్తుకున్నారు. నా ఆత్మరూపమే నా తోడునీడ.. నా ప్రతిరూపం తానై నన్ను మనసున్న మనిషిగా నిలబెట్టే అపురూపవరం అని కొనియాడారు. నీడ తాను ఏటవాలుగా నడుస్తూ నన్ను నిటారుగా నిలబెడుతూ అంటూ కొనసాగించిన పంక్తుల్లో వాస్తవికతను కవితాత్మకంగా ఆవిష్కరించారు. ఎగుడు దిగుడులను గమ్మున దాటేస్తూ అడుగడుగునా నిరాశల నిప్పురవ్వలని నాపై పడకుండా ఛాయా ఛత్రమై అక్కున చేర్చుకునే అమ్మఒడి తానేనంటూ అభివర్ణించారు.

అంతరాత్మ అరవిందం తానై తప్పొప్పుల తగాదాలకు పరిష్కార పరిమళాలద్దుతూ మలయసమీరపు ఓదార్పుల వేవెనలు వీచే పూరేకుతానేనని తేల్చిచెప్పారు. ఆత్మలకు వెలుగు జిలుగులు పంచి పరమాత్మలుగా నిలబెడుతుందని చెప్పడం బాగుంది. అద్వైత భావనలకు అద్దం పడుతుందని పేర్కొంటూ కవయిత్రి నీడపై తమకున్న తాత్విక భావనను చక్కగా ప్రకటించారు. ఆఖరి క్షణాల్లో జీవాత్మగా వేరుపడి అనంత లోకాలకు చేరుతుంది. నా నీడగా తాను అజరామరమవుతుందని తెలియజెప్పారు.

కవయిత్రి సావిత్రి గారు నీడను ఆత్మరూపంగా.. ప్రతిరూపంగా.. మనసున్న మనిషిగా నిలబెట్టే అపురూపవరంగా.. ఛాయా ఛత్రంగా అమ్మఒడిగా.. పూరేకుగా.. ఇలా విభిన్న కోణాల్లో ఆవిష్కరించడంలో సఫలమయ్యారు అలతి అలతి పదాలతో అంశాన్ని కవితాత్మకంగా ఆవిష్కరించారు.

భల్లం భాష్యం

కవి నుంచి కవిత్వంలోకి...

కవి కవిత్వాభిమానియే కాదు.. కవిత్వ ధర్మం మీద,. కవిత్వాభిమతం మీద, కవిత్వ స్పర్శనం మీద, కవిత్వ దర్శనం మీద, శాఖోపశాఖలుగా విస్తరిస్తున్న ప్రపంచ కవితా రూపాల సందర్శనం మీద అవగాహనాత్మక అభినివేశం అంతో ఇంతో కాదు- కవికి ఎంతో ఉండాలి..!

ఏ వస్తువు గూర్చి అయినా అలవోకగా కవిత్వం రాయగలగడం, తేలిక భాషలో సూటిగా పాఠకుడికి కవిత్వాన్ని చేరవేయగలగడం, కవిత్వమంతా కవిత్వంలోనూ సమాన లక్షణంగా కవి భాసింపచేయడానికి కవి ఒక రకంగా ప్రసవ వేదనకు గురి అవుతుంటాడు. సంవిధానంలో ప్రయోగాలు చేస్తూ, భావ వ్యక్తీకరణలో సాంద్రత సాధిస్తూ- వస్తు రూపాలు రాటు తేలిన కవిత్వాన్ని కవి మరింత బలోపేతం చేయడానికి నిరంతరం అక్షర ధ్యానం చేస్తూనే వుంటాడు.

> ఏ వస్తువు గూర్చి అయినా అలవోకగా కవిత్వం రాయగలగడం, తేలిక భాషలో సూటిగా పాఠకుడికి కవిత్వాన్ని చేరవేయగలగడం, కవిత్వమంతా కవిత్వంలోనూ సమాన లక్షణంగా కవి భాసింపచేయడానికి కవి ఒక రకంగా ప్రసవ వేదనకు గురి అవుతుంటాడు.

అన్ని ఆకుల్లోనూ కుంకుడాకులు చాలా దళసరి అన్నట్లు అందరి కవుల కవిత్వంలో కొందరి కవిత్వం మరీ గడుసరిగా ఉంటుంది. జాలి వడిపెట్టి బొంగరాన్ని తిప్పినట్లు కవిత్వాన్ని చదువుతున్న పాఠక హృదయాల్ని తనవైపు అనేకంటే- తన కవిత్వం చుట్టూ వలయాకారంగా తిప్పుకుంటారు. ఈ కొందరి కవులలో మరికొందరి కవిత్వమైతే పచ్చని చేలతో ఉయ్యేల లూగుతున్న పొలాల్లా కాక, నల్లగా నూనె కుక్కుతూ కలుపు మొక్కల పోగులతో సాగుకి సిద్ధంగా ఉన్న పొలాల మాదిరి ఉంటుంటాయి.

కవిత్వం రాయాలనే తపన ఉన్నప్పటికీ, ఎలా చెప్పాలో ఎలా మొదలెట్టాలో- ఏ విధంగా చెప్పదలచుకొన్నది పాఠకుడికి అర్థమయ్యేటట్టు కవిత్వీకరించాలో తెలియక, అయోమయంలో పడిపోయి, హడావిడి చేస్తూ, నాలుగు కాగితాలు బరబరా గీకేసి, సంతృప్తి చెందక, నలిపి, ఉండలు చేసి, చిత్తుబుట్టలో విసిరివేసే అనేకానేక నవ యువకవులు అడుగడుగునా ఎదురవుతుంటారు. అటువంటి ఔత్సాహిక కవులను సానపట్టి వజ్రాలుగా సత్ఫలితాలు ఇచ్చిన దాఖలాలు అంతగా మీదు మిక్కిలి జరగలేదని చెప్పక తప్పదు.

కొంతమంది కవులుగా చనిపోయి, నినాదాల్ని పట్టుకొని వేళ్ళాడుతున్నారు. అదీ తప్పే, ఎందుకంటే కవిత్వం వరిస్తే- కనీసం దాన్ని గురించి ఆలోచిస్తే- కవి సజీవంగా వుంటూ ప్రజల నాలుకలకు అతుక్కుంటూ ఉన్నాడన్న మాట. అప్పుడు ప్రతీది అద్భుతంగా వుంటుంది. బాధ కూడా స్వచ్ఛమయిన ప్రభావాన్ని చూపుతుంది కాబట్టి జీవన గమనంలో ఏ మంచి కవిత్వం, ఏ కవిదైనా కనిపించినా దానికి కృతజ్ఞత ప్రకటించాలి.

కొంతమంది కొత్త తరం కవులు. ప్రాచీన, ఆధునిక సాహిత్యాల్ని చదవడం కన్నా- ఆంగ్ల సాహిత్యంపై ఆధారపడుతూ , సొంత అనుభవాలపైనే ఎక్కువ మక్కువ చూపుతూ- అనువాద రచనలవైపు మొగ్గ చూపుతున్నారేమో... మంచిదే కానీ- అమూల్యమైన సాహిత్య అధ్యయనం ఉంటే బంగారానికి తావి అబ్బినట్లు అవుతుం దేమో-

కవులెందరో- ప్రవర్తనావాదం అనే పాఠకాకర్షణలో పడి ఆవేశాన్ని ఆలోచనగా స్థిమిత పరచుకోలేక, కకావికలుగా కవిత్వీకరించడం ఈ మధ్య కనిపిస్తోంది. భౌతిక వాంచలూ సుఖాలు ఆవేశాలు కావేశాలు యిట్టి తాత్కాలికాలు ఉదాత్త కవిత్వం ముందు పరిత్యజించ వలసినవేనన్న స్పృహ ఉత్తమ కవులన్న వారు ఎపుడూ గుర్తించుకుంటే మంచిది.

వస్తువూ, శిల్పమూ ఒక దానితో ఒకటి పోటీపడినట్లు కవిత్వాన్ని తీర్చిదిద్దుకునే బాధ్యత కవికి అధికమవుతుంది. వ్యక్తి యొక్క వ్యక్తిగత అంశాలను వస్తువుగా ఎంచుకునేటప్పుడు, దాని నొక వ్యవస్థీకృత సత్యంగా వ్యక్తీకరించడంలో కవి కృతకృత్యుడు కావాలి.

కవి కావాలనుకునే, కవిగా రాణించాలనుకునే చాలా మంది తొలిదశలో- అభిమాన కవి కవిత్వంపై మోజు పెంచుకుని, ఆ అభిమాన కవి కవితల్ని తరచూ ఆలపిస్తూ, కాగితం మీద కవిపెట్టే దశలో అనుకరిస్తూ- అనుసరిస్తూ ఉంటారు. ఆ అభిమాన కవిలా రాయాలని, అలాగే రాసి కవి అనిపించుకోవాలనే ఆవేశం, ఆలోచన, కోరిక ఇందుకు ప్రధాన కారణాలుగా ఉంటాయి.

కవులకు దార్శనికులకు దగ్గర పోలిక ఉంటుందేమో వివక్షలు, అసమానతలు తొలగించడంలో అవసరమైతే- సమాజానికి సంస్కరణలు, తేగలిగిన ఆచరణాత్మక దార్శనిక కార్యకర్తలై కవులు ఉండాలి. దురదృష్టవశాత్తూ చాలామంది కవులు తాత్త్విక భావాలు కనీసం రాజ్యాంగ స్ఫూర్తిని అందుకునేటట్లు లేకపోయింది. అలాగే వివక్షలకు గురౌతున్న సామాజిక వర్గాలకు చెందిన కొందరు కవులు తమ అస్తిత్వ చైతన్యాలకు గట్టిగా ప్రదర్శించటంలో ఇంకా వెనుకబడే ఉన్నారని చెప్పక తప్పదు.

కవి ఏం రాసినా, మనం కూడా భాగమైన సమాజం గురించీ, జీవితం గురించీ, దుఃఖం గురించీ సంతోషం గురించే కదా వర్ణించి రాసేది? కవి ఎప్పుడూ వ్యక్తిగత జీవితం, సాంఘిక జీవితం వేరు వేరని అనుకోడు. మరి సాంఘిక దృక్పథం రాజకీయ కార్యాచరణ మాటేమిటంటారా? ఒక్కొక్క కవికి ఒక్కో రంగం అంటే అభిమానముంటుంది. అయినా ప్రధాన వ్యాసంగం సాహిత్యమైనప్పుడు- కవిత్వం ఉన్న కవికి సాంఘిక దృక్పథం కచ్చితంగా ఉంటుంది.

కవి పైకి వేరు వేరుగా కనిపిస్తున్నా, జీవాత్మ పరమాత్మ కలిసున్నట్లు ఏకమయ్యే ఒక పరమోన్నత స్థితి కవి పొందిన తరువాతే- భాష- భావాల సంగమ స్వరూపానికి సాక్షీభూతంగా నిలుస్తాడు.

నిజమైన కవికి జలపాతంలా ఉరకడం తెలుసు. అగ్ని కేతనంలా ఎగరడం తెలుసు. మంచు బిందువులా జారిపోవడమూ తెలుసు. వెన్నెల తుఫానై చుట్టు ముట్టడమూ తెలుసు. అందుకు ఆ కవిలో భావావేశం, భాషావేశం, పదావేశం త్రివేణీ సంగమంగా సుళ్లు తిరుగుతూ, మనల్ని కుదిపి కుదిపి పారేస్తాయి. అప్పుడు మనం శక్తి హీనులమై ఆ కవిత్వ పాదాల ముందు గిలగిలా కొట్టుకుంటాం. అంతలో హఠాత్తుగా కొత్త నెత్తురేదో ఎక్కినట్లు నూత్న జవ సత్వాలతో తాండవం చేస్తుంటాం. అప్పుడు ఆ కవితకవ స్పృహతో మానవీయత ఇంకా మిగిలి ఉందంటానికి గొప్ప దాఖలా ఏర్పడుతుంది. కవిత్వం పూర్తిగా సామాజిక మయినప్పుడు

ఆ కవిత్వం
వజ్రమో,
వైడూర్యమో,
ప్లాటినమో కాదు,
అంతుకు మించి...



-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

మట్టి బంధం

ఆ మట్టిలో పుట్టిన మమకారం
అక్కడి గాలిని పీల్చిన బాల్యం
మొగ్గ తొడిగిన మొక్కా
మానయ్యేదాక అల్లుకున్న
స్నేహ పూర్వక తీగ
స్నేహ సమీరంలో రెపరెపలాడే
పత్ర కెరటాలు.
వయసెరుగని అంతరాలెరుగని
స్నేహ సౌందర్యం వారిది
బహిర్గతం కానీ అంతరాత్మా
కంటి చూపుతో పసిగట్టే పరిజ్ఞాని
అతను నిరంతర కృషివళుడు
అందనంత ఎత్తు ఎదిగినా అతను
ఒదిగి ఉండే విశాల హృదయం
వేదన నిండిన దీనత్వాన్ని
జాలి కళ్ళతో చూసే మనసు.
బడిలో ఆడిన అడుగు జాడలు
వెతుక్కుంటూ వెళ్తాడు
అక్కడి నాలుగు గోడల మధ్య
దాగిన బడిబాల్య బంధం కోసం!
చిన్ననాటి జ్ఞాపకాలు చప్పరిస్తే
చక్కరి మిఠాయి బిల్లలు అవి
తనకు జన్మ నిచ్చిన పుడమి తల్లి
అంటే అమితమైన మమకారం
అక్కడి మట్టి వాసనను
మనసారా ఆస్వాదిస్తాడు.
నేల తల్లి రుణం తీర్చుకోవాలనే
మదినిండా అతని తలంపు
దిగంతాలను కోల్పోయిన దీనులకు
దానం చేసే దాతృత్వం
కలలు చీద్రమైన చోట అతని
మనసు అశ్రువులు చిందించి
పచ్చని చూపులు పరుస్తాడు.
చిట పట మాటలు కురిసిన
మతలబులేని మనసు అతనిది
లక్ష్మీ పుత్రుడు ఒకరైతే
మరొకరు కష్టాల కడలి ఈదిన
సరస్వతి పుత్రుడు మరొకరు
వారిది విడదీయని అనుబంధం
రక్త బంధాన్ని మించిన బంధం
కృష్ణ కుచేలుడి అనుబంధం వారిది

- బొల్లారపు బాబన్న
9440654583

ఔను... పాఠకులు కావలెను...

'కవిత్వం రాస్తాను కమ్మగా... నా కలం సాగినంత... భావాక్షరాలు రాలినంత' అంటూ వినమ్రంగా ప్రకటించుకున్న కవి కడారు వీరారెడ్డి గారు తమ 14వ గ్రంథంగా 'పాఠకులు కావలెను' పేరుతో వెలువరించారు. కవిత్వంతో పాటు కథలు, దీర్ఘకవితలు రాయడంలో అనుభవం ఉన్న ఆచార్య కడారు గారు ఇప్పుడు విలక్షణమైన భావాలతో ఈ గ్రంథాన్ని సాహితీ లోకానికి అందిస్తున్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా.. రసాయనశాస్త్ర ఆచార్యునిగా అందరి మన్ననలను అందుకున్న ఆయన సాహిత్య సృజనలోనూ నిరంతరం కృషి చేస్తూ ముందుకు సాగడం ముదావహం.

'అమృతం ఒడిసిపట్టగలిగే పాత్ర ఉందో లేదో నాకు తెలియదు కానీ.. జ్ఞానానికి మాత్రం పుస్తకం కూడా ఒక భాండాగారమే' అంటూ తమ ముందు మాటలో పేర్కొన్న ఆచార్య కడారు గారు పుస్తకాలు చదివే వారి సంఖ్య రోజు రోజుకు తగ్గుతున్న నేపథ్యంలో.. పఠనాసక్తిని.. అధ్యయన శీలతను పెంపొందించడానికి.. ఈ గ్రంథానికి వినూత్నమైన రీతిలో 'పాఠకులు కావలెను' అని శీర్షికను నిర్ణయించారు. 'ఔను.. పాఠకులు కావలెను' అన్న ఆలోచన మన అందరిలో చిగురించడానికి వీలుగా ఈ పుస్తకాన్ని అందమైన ముఖచిత్రంతో ముస్తాబు చేశారు. కవి ఆచార్య కడారు వీరారెడ్డి గారి వయస్సు 68 అనుకుంటా.. ఇందులోనూ 68 కవితలకు చోటు కల్పించారు. వస్తు ఎంపికలో కొత్తదనాన్ని చూడగలం..

అభివ్యక్తిలో వైవిధ్యాన్ని వీక్షించగలం.. వస్తు విశ్లేషణలో ఆయన అపార జీవితానుభవాన్ని.. అనుభూతులను అడుగడుగునా చూస్తాం..

'కవిత్వం సృజనాత్మకం
ఒక ధ్యానం..
అంతః సంకేతానికి
ఓ మహార్ణవ ఉత్తుంగ తరంగం'

అని భావించే ఆచార్య కడారు గారు కవిత్వం.. తాత్త్విక చింతనకు దారిదీపం అని ఇందలి కవిత్వం ద్వారా తేల్చి చెప్పే ప్రయత్నం చేశారు.

'రేపు అనేది ఎప్పుడూ కొత్తే అయినా..
ఆశయాలు సిద్ధించే మైలురాయి'

అని గట్టిగా విశ్వసించే కవి వీరారెడ్డి గారు జీవితం సుఖ దుఃఖాల సంగమం అని తమ తాత్త్వికతను చాటుకున్నారు.

'కాలం గోడల నడుమ
నడియాడే జీవితం..'

అందరికీ గొప్పగా ఉండదన్న అర్థం ధ్వనించేలా.. 'నిన్న', 'నేడు', 'రేపటి'కి కాలాలే నిర్మాణ పదార్థాలని వివరించారు.

'అందనంత ఎత్తుగా పెరిగే మొక్కలే ఎప్పుడూ
అందమైన పూలు పూయవు..'
'స్వతంత్ర్య గుణులెప్పుడూ
ఎంత ఎత్తులో ఉన్నా
శిఖరాల్లా గోచరించర' ని తేల్చి చెప్పారు.

'అద్దం' పై అందమైన, ఆలోచనాత్మక భావాలతో ఓ కవితకు రాసి మెప్పించారు. అద్దం పైపై ముసుగులు తప్ప.. లోపలి మనిషి చూపించదనీ.. చెబుతూనే మనసు అద్దంలో.. వ్యక్తిత్వానికి వేలిముద్రలు.. నిజమైన ఉనికికి జాడలని పేర్కొన్నారు. 'మనసు ఓ రహస్య పేటిక' అనీ.. 'ఎవరికి వారే తెరుచుకోగలిగే యవనిక'.. అంటూ చక్కని ముగింపునిచ్చారు.

'పురస్కారాలు'.. 'కీర్తికాంక్ష' గురించి అద్భుతమైన భాష్యం చెబుతూ 'అమ్మకానికి కీర్తి' కవితను రాశారు.

'ఒకప్పుడు కీర్తి
ఆత్మ గౌరవానికి స్ఫూర్తి'

అంటూ చక్కని ఎత్తుగడతో ప్రారంభించారు. అయితే.. కీర్తి ఇప్పుడు అమ్మకానికి ఆస్తి అంటూ.. వ్యాఖ్యానించారు. పురస్కారాల తంతుపై తమ భావాలను నిర్మొహమాటంగా ప్రకటించారు. పురస్కారాలు తెర వెనుక భాగోతాలను ఎండగట్టారు.

'పెడదారి' శీర్షికతో రాసిన కవితలో.. అదను చూసి దశ 'దిశల' మాటు వేస్తున్న మానవ మృగాలపై ధ్వజమెత్తారు.

'ఆప్యాయత వెల్లివిరిసే పిలుపులు
మమతల బంధాలు.. అనుబంధాలు
ప్రతిష్ఠించే ప్రథమాలు'

అంటూ 'తేట తెలుగు పిలుపు' కవితను రూపుదిద్దారు.

'చెరుకు గడలా నమిలే పాఠకుడికే
కవితలోని సారం ఎరుక..
క్షీర నీరాల తారతమ్యం హంసకెరుక'

అంటూ 'పాఠకులు కావలెను' కవితను కొనసాగించారు.

కవితా సృజనకు.. మూల్యాంకనం దారి తప్పే ప్రమాదం లేకుండా.. పాఠకులు తగ్గకుండా చూడాలని ఉందని పెరుగుతున్న కవుల సాంద్రతకు యోగ్యంగా.. పాఠకులు కావాలని కాంక్షించడం బాగుంది.

కవిత్వంకు కాదేదీ అనర్హం అని శ్రీశ్రీ చెప్పినట్లు.. 'చిత్తు కాగితం' పై కవితను రాసి ఆచార్య కడారు గారు.. చిత్తు కాగితం పై ఆయన రాసిన ప్రప్రథమ కవితా రూపు రేఖలను.. మసక జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

'సామాన్యుడిలా జీవిస్తేనే..
తృప్తి గుండెలో గూడు కడుతుందనీ..

(ఈ నెల 6న ఆచార్య కడారు వీరారెడ్డి కవిత్వం 'పాఠకులు కావలెను' ఆవిష్కరణ సందర్భంగా పుస్తక సమీక్ష)

నిద్ర కంట్లో కాపురం చేస్తుందనీ..
ఒళ్ళో సంతోషం నాట్యం చేస్తుందని'

పేర్కొంటూ 'నీలాగే ఉండాలని' కవితను తీర్చి దిద్దారు.

'నిను వీడని నీడను నేనే' పేరుతో రాసిన కవితలో విస్తృతంగా వినియోగించుకున్న 'సెల్‌ఫోన్' పై కవి తమ భావాలను మనతో పంచుకున్నారు.

సెల్‌ఫోన్ ప్రయోజనాలను.. అనర్థాలను.. పరిణామాలను విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు. 'ఆచార్య దేవోభవ' కవితలో...

'నిబద్ధతే నిత్య ధర్మంగా
హక్కులను, బాధ్యతలను సమతుల్యంగా
బేరీజు వేస్తూ... చెక్కుకుంటూ వెళ్ళే
ఆచార్య జీవితం..
ఓ అందమైన శిల్ప కళాఖండం'గా

అభివర్ణించారు.

'సర్వం శరణం గచ్ఛామి' కవితలో అవినీతిని ఎండగడుతూ.. అపహాస్యమవుతున్న ప్రజాస్వామ్యాన్ని ఎత్తి చూపారు. 'చిరిగిన హృదయం' కవితలో.. ఎంత సంపద కూడగడితేనేం? 'జీవన సంధ్య'లో ఒంటరితనం తిప్పలు తప్పడం లేదనీ.. 'పట్టాలెక్కిన చదువులు... రెక్కలొచ్చిన పక్షులు... తల్లోదిక్కున భూమికి ఆవలి వైపు వలసలు... ఉద్యోగరీత్యా చెల్లాచెదురు.. మళ్లీ లంకంత ఇంట్లో ఇద్దరే' నంటూ నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టారు.

'ఆకలికి అడ్రసు గల్లంతే' కవితలో 'పెళ్ళి మనది.. పెత్తనం మరొకరిది' అంటూ ఆసక్తికరమైన ఎత్తుగడతో ప్రారంభించారు. 'అన్నపూర్ణ లాంటి దేశంలో.. ఇంకా ఆకలికి అలమటించే అనాథలా?' అని ప్రశ్నించారు.

'ఆ మెట్లు' కవితలో

జీవితం... తీగమొక్కలాంటిదనీ... ప్రతి ముడి మలుపులో పువ్వునో, కాయనో ఇవ్వదనీ.. ఓటమికి వెరువని కార్యశూరులకు ఆ పాఠాలే విజయానికి సోపానాలని విడమరిచి చెప్పారు.

'వలపట దాపట' కవిత ద్వారా పాఠకులు పొందే అక్షరానుభూతే కవిత్వానికి గీటురాయి అనీ.. కవి, పాఠకుడు.. సాహితీ సేద్యానికి.. వలపట.. దాపట! కలిసి సాగితేనే కవితా సిరుల పంట అని తెలియజెప్పారు.

'వయసు మీరినా సొగసే' కవితలో మనసున పూచిన బోసి నవ్వు.. పెదాల విరిసిన చిరునవ్వు వయసు మీరినా.. సొగసే అంటూ వ్యాఖ్యానించిన తీరు బాగుంది.

'విశ్వ రచన' కవితలో నటనలో.. కవనంలో.. శిల్పంలో.. చిత్రంలో.. ప్రతి పనిలో సహజత్వం సిద్ధిస్తేనే అందం అని ప్రకటించిన తీరు బాగుంది.

'మత్స్య యంత్రం' కవితలో.. అమావాస్య చంద్రులు కేవలం ఊహా వినోదాలనీ.. తుమ్మకు ఆవులింతకు అతీతులు ఎవ్వరు? అని ప్రశ్నించారు.

మరో కవితలో.. 'అక్షర క్షీరం.. ఉప్పొంగే జ్ఞాన సాగరమనీ అంకెతో కూడిన జంట పయనం.. అతులిత శోభాయమానం' అని వ్యాఖ్యానిస్తూ ముగించారు.

'ప్రకృతి పాఠం.. నవనవోన్మేషణకు
ప్రథమ పథం'

అంటూ 'కాల త్రిభుజం' కవితను తీర్చి దిద్దారు.

'నింగికి నిచ్చెన' మరియు 'భారతీయత' కవితల్లో మన దేశ స్వాభిమానాన్ని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.

'అడవి సృష్టే.. ఒక అద్భుతం' అంటూ రాసిన కవితలో.. మనిషి ఉనికికి.. నాగరికతకు ముడివేసి పెనవేసిన.. అడవి ఒడి.. అదృష్టాల గుడి అంటూ కొనసాగించిన పంక్తులు కవితకు శోభను కూర్చాయి.

చక్కని పదబంధాలతో 'చదువని పుస్తకం' కవితను రూపు దిద్దారు. ఈ గ్రంథములోని మంచి కవితల్లో ఇదొకటి..

'అక్షరం.. ఓ జ్ఞాన కణం
పుస్తకపు పుట
విరిసిన అక్షరాల తోట...'

అంటూ చక్కని భావాలను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.

పుస్తకం.. అంగట్లో వ్యాపార వస్తువు కాదు.. ఓ అమూల్య జ్ఞానకలశంగా ఆవిష్కరించారు.

'ప్రతి చదువని పుస్తకం...
అడవి కాచిన వెన్నెల కాద'ని తేల్చి చెప్పారు

ఈ కవిత ముగింపులోనూ కవి ఆచార్య కడారు గారు ప్రయోగించిన పదబంధాలు కవితలో చక్కగా ఒదిగిపోయాయి.

ఇంకో కవిత ద్వారా 'దాంపత్య అంతః సూత్రా'న్ని ప్రబోధించారు. నిశ్చలమైన జీవన శైలికి నిలువెత్తు అందం.. నియమ నిష్ఠల పాలననేననీ.. నొసట రాతలు.. లక్ష్మణ రేఖలు.. మనిషి సృష్టేనని విడమరిచి వివరించారు.

ఇలా ఎన్నో కవితా పంక్తులు ఈ కవితా సంపుటిలో ఉదహరించడానికి యోగ్యంగా ఉన్నాయి.

ఇందలి కవితల్లో కవి ఆచార్య కడారు గారి అపార అనుభవం.. వారి ఉత్తమ వ్యక్తిత్వం.. సామాజిక చింతనం ముప్పేట అల్లుకుపోయాయి. వ్యంగ్యం.. మరి కొన్ని కవితల్లో చమత్కారం.. మిగతా కవితల్లో సామాజిక దృక్పథం.. అడుగడుగునా మనకు కానవస్తాయి. ఆచార్య కడారు వీరారెడ్డి గారు తమ జీవితానుభవాన్ని రంగరించి.. సామాజిక చైతన్యానికి.. ఉపయోగపడేలా ఇందలి కవితల్ని తీర్చిదిద్దారు. 'ఔను పాఠకులు కావలెను' అన్న ఆలోచన మన అందరిలోనూ మెరిసే విధంగా వైవిధ్యంగా ఇందలి రచనల్లో తమదైన శైలిని పాటించారు. వస్తు విశ్లేషణకు పెద్దపీట వేశారు.. శిల్పం.. అభివ్యక్తిలో ఇంకొక అడుగు ముందుకు వేస్తే బాగుండేదని మనకు అనిపించినప్పటికీ.. కవితా వస్తువును సమగ్రంగా పాఠకులకు అందించడంలో.. ఆవిష్కరించడంలో ఆచార్య కడారు గారు సఫలీకృతులైనారు. ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారి పీఠిక గ్రంధానికి నిండు శోభను కూర్చింది. అలాగే సూరారం శంకర్ గారు డిజైన్ చేసిన కవర్‌పేజీ అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది.

కవి అంటే...

కాలుతూ వెలుతురునిచ్చే కాగడాగా భావించే ఆచార్య కడారు గారు.. కవులు 'కులం వీరులు'గా కాక.. 'కలం' వీరులుగా భాసిల్లాలని కాంక్షించడం బాగుంది. కవిత్వ సృజనలో ఆచార్య కడారు గారన్నట్లు... 'వామనుడి'గా కాక.. కవి.. అక్షర వేమనుడిగా వికసించాలని కోరుకోవడం కూడా బాగుంది. ఆచార్య కడారు గారు స్వయంగా పేర్కొన్నట్లు.. పై పొట్టు మెరుగుల పరిధులు దాటి.. అగాధంలో నెలవైన అర్థంపై గురిపెట్టే కవిగా ఆయన మరింత వెలుగొందగలరన్న విశ్వాసముంది.

వారు సృజించే ప్రతి పంక్తీ
ఓ వినూత్న రసరాగ స్ఫూర్తిగా
వెలుగొందాలని కోరుకుందాం.

ఈ సందర్భంగా ఆచార్య కడారు గారికి శుభాకాంక్షలు తెలియజేద్దాం.

- డి. సాన్వి
సెల్: 74434134

ప్రతులకు:
ఆచార్య కడారు వీరారెడ్డి, 8-12-20, బృందావన్ నగర్, రోడ్ నెం.8, హబ్సిగూడ, హైదరాబాద్-500007, సెల్: 9392447007
పేజీలు: 88, వెల రూ.100/-



పూలబాట

నేల రాలినా, నీళ్ళల్లో కలిపినా
పూలు పూలే
పరిమళాలను పరిసరాలకు అందిస్తవి
వాటికి కొలమానాల్లేవ్
అవి జగద్విఖ్యాతే.

చెట్టూ గుట్టా తిరిగి సాధించాం
తీరొక్క పువ్వును కూర్చి పేర్చినం
చుట్టూ చేరి మొక్కినం
ఆడినం, పాడినం
ఇక పూల గుణాల్ని తలలో నింపుకోవలె

పూలు బహు గమ్మత్తయినవి
మనల్ని పిలువకుండనే
వాటి ఒళ్ళో వాలతాం

అవి పసి పిల్లల్లాంటివి
మనసు సింహాసనంపై
ఇష్టంగ కూర్చో బెడతయ్.

మొక్కల్ని నాటుకున్న
దారుల్లో జీవన గమనం
నవ్వు పూల ఎన్నెల్ని కురిపించి
బతుకంతా పూలహారతి పడుతుంది.

పూల పండుగలు మన ప్రకృతిని
సుమగంధం చేయడానికే

- వనిపాకల లచ్చిరెడ్డి
9966897001

పండుటాకులు

సాగర ఘోషకు
తీరం అతలాకుతలం
జీవిత ఆటుపోట్లకు
పండుటాకుల పరేషాన్లు !.

నైతిక విలువలన్నీ తరిగి..
విత్తం కోసం ఎత్తుపీట వేసి..
అయినోళ్లే అనాథల్ని చేయగా..
మలిసంధ్యలో మనో వేదనలు !.

ఆరోగ్య సమస్యల కుప్పలు
ఆర్థిక సంక్షోభాల్లో వృద్ధులు
సంతానమే దూరమై దుఃఖాలు
ముసలి ముతక బతుకు వెతలు !.

డిజిటన్ యుగపు పోకడలు
ఖరీదైన కార్పొరేట్ చదువులు
సాఫ్ట్‌వేర్ వడ్డించిన కొలువులు
వేతనమే లక్ష్యంగా కాళ్లకు రెక్కలు !.

సంతానమే సముద్రాలు దాట..
మనవళ్లు మనువరాళ్లు కానరాక..

ఆత్మీయ హస్తాల భాగ్యమే లేక..
వృద్ధాశ్రమాలే గతైన నిన్నటి వీరులు !

కన్నోళ్లు కడుపులో పెట్టుకొని..
మనుమళ్లే తాతకు ఊతకర్రలై..
అయ్యవ్వల అనుభవ రెక్కలతో..
ఆకాశ అంచులు ముద్దాడుదాం !

వయోవృద్ధులు జాతి గురుతులు
పండుటాకులు గట్టి పునాదులు
మలిసంధ్య యోధుల మార్గదర్శనాలు
కావాలి నేటి యువతకు చుక్కానులు !

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

అస్తిత్వపు ఘోషలు

ఒక భ్రమణాన్ని
ఒక జీవనయానం గుర్తిస్తుంది
జీవన చక్రం లో
ఆవేశపడ్డ బలం గర్జిస్తోంది.
చతికిలపడ్డ ప్రాణుల ఘోష వినబడుతోంది.

అధికారపు దాహపు ధ్వనుల్లో
ఆక్రమణలు పరాక్రమాలుగా
దుముకుతున్నాయి.

వక్రీకరించిన మతసిద్ధాంతాల్లో ఊగినపుడు
గుణంలేని కులం నరాలు చీలుస్తున్నపుడు
సోమరితనం ముసుగులు తొడిగినపుడు
స్వార్థపు దాడులు తెగబడుతుంటాయి .

అశాంతి చిత్రం లో
చెక్కబడ్డ అసంతృప్తి తీరాలు
బతుకుల్ని చిద్రం చేస్తున్నాయి.

కన్నులు తొలిచే
ఉగ్రవాదంలో జీవికలు
మునుగుతున్నాయి .

వ్యూహ ప్రతి వ్యూహాల్లో
చెల్లా చెదురైన ఆర్తనాదాలు గా
బతుకులు కూలిపోతున్నాయి .

వాలిన చరిత్ర సాక్షిగా
క్రమశిక్షణ పాఠం రుచి చూడని
మానవాళి విధ్వంస దృశ్యాల్ని
తట్టి లేపుతుంది .

ఐక్యత లేని రాజ్యం
అస్తిత్వపు ఘోషలు
విలపిస్తుంటాయి .

-గవిడి శ్రీనివాస్
7019278368, 9966550601

అమ్మను బ్రతకనివ్వండి

నవమాసాలు నీకొక రూపాన్నిచ్చి
అనునిత్యం నిన్ను మోస్తూ
నిద్ర మాని నీతో ఊసులు చెప్పి
ప్రతి క్షణం నీ రాకకై ఎదురు చూసి
అణువణువూ నిప్పు కణికల్లాంటి
పురుటి నొప్పుల ఉరుముల మధ్య
రుధిర తుఫాను హోరులో
చావు అంచుల చవి చూసి
నిన్ను ఈ అందమైన ప్రపంచానికి
పరిచయం చేసిన చిరునామా అమ్మ

అమ్మా అనే నీ నోట పలికిన మొదటి
పదానికి ప్రాణం మొత్తం
నీ పాదాక్రాంతం చేసింది అమ్మ..
నీ బోసి నోట నవ్వు అవ్వడానికి
నీ చేత బొమ్మైన అమ్మ...

నేడు స్వార్థపు సంకెళ్ళ మధ్య
కన్న పేగు మమకారమే
కన్నీటి అంధకార సంద్రమయ్యే..

అమ్మా అనే పదం ఆర్థిక బంధాల
నడుమ ఆర్తనాధం చేస్తుంది
దిక్కులు పిక్కటిల్లేలా
హృదయ ఘోష ఎడారిలో వానయ్యింది...

జన్మదాతల గర్భ శోకం
భోగిలాలస పంటయ్యింది..
సామాజిక విలువలు మరచి
సామాజిక మాధ్యమాల
సరదాల కోరికల పరదాల
మాటున ఉరి కొయ్యకు
నిర్జీవ కొయ్య బొమ్మయ్యింది.....
పంచిన రక్తం మూగ రోదన

అర్థమైతే వ్యర్థమైన ఆలోచనలకు
తిలోదకాలిచ్చి బాధ్యత పంచుకునే
భరోసా అవ్వు అమ్మ మనసెరిగి
మరో అమ్మ అవ్వు..అమ్మ మోముపై
ఎన్నటికీ చెరగని దరహాసం అవ్వు....
అమ్మను అమ్మగా బ్రతకనివ్వు...
మహా...????

-దుర్గా మహాలక్ష్మి ఓలేటి
7702010056

నా తెలుగు భాష

మధువులొలుకు తెలుగు మధుర భాష
మమత పంచు నెపుడు మాతృభాష
తెలుగు నేర్చి నీవు తెలివి పెంచు
అమ్మ భాష నీకు అండ ఎపుడు.

మాతృభాష యెడల మనసు పెట్టి
మాటలాడు మెపుడు తేట తెలుగు
ఆంగ్ల భాష మోజు అంత మవగ
తెలుగు విలువ నీవు తెలియజెప్పు.

శతక పద్య నీతి సత్య వాక్కు
నీతి ధర్మ సుగుణ రీతులబ్బు
స్వచ్ఛ భారతీయ సంపదవగ
తెలుగు విలువ నీవు తెలియ జెప్పు.

వ్యాకరణము తోడ వరలు భాష
వేల యేండ్ల నుండి వెలుగు భాష
రామదాసు నోట రామపలుకు
ప్రజల నాల్క లందు పదిల పడెన

కన్న తల్లి వలెను కరుణ కరియు
వెన్న ముద్ద కన్న మిన్న భాష
పోతన కవనమున పూతరేకు
కమ్మ నైన తెలుగు అమ్మ భాష



-అయిత అనిత
8985348424

మనసును కదిలించే కథలే..."అద్దంలో బొమ్మలు"

కంటి ముందు దృశ్యాలను మనసులో చిత్రిక పట్టి అక్షరాకృతి ఇచ్చే ఓ గొప్ప ప్రక్రియలలో కథ ఒకటి.

ఇంటి నుండి ప్రపంచం దాకా, రక్త సంబంధాలు నుండి మానవ సంబంధాలు దాకా ఒక మనిషి అనుభవంలో ఎదురైన ప్రతి సంఘటనలో ప్రతి పాత్రను లోతుగా పరిశీలించి 13 కథలతో ప్రముఖ రచయిత శ్రీ జంధ్యాల రఘుబాబు వ్రాసిన పుస్తకమే: ""అద్దంలో బొమ్మలు". ఈ పుస్తకాన్ని రాయలసీమ కథాసింగం స్వర్గీయ సింగమనేని నారాయణ గారికి అంకితమివ్వడం సముచితమైన గౌరవం.

అనుభవంలోకి వచ్చిన ఏ అంశాన్ని వదలక ఓ ఉత్తమ ఆలోచను జోడించి సమస్యను ఎత్తి చూపడంలో ఒక కొత్తదారిని వెతుక్కొని, అదే స్థాయిలో ఓ ఉన్నతమైన ముగింపుతో కథకు పరిపుష్టం చేయడం ద్వారా పాఠకులలో ఓ ఆసక్తిని మరియు ఓ ఆలోచన రేకెత్తించి సఫలీకృతులయ్యారు జంధ్యాల గారు. ప్రతి కథలో సన్నివేశాలను గమనిస్తే చాలా సరళంగా ఉండటంతో పాటు కొన్ని చోట్ల ఆయన కలం కవిత్వపరిమళం కూడా గుప్పించింది.. ఏ కథను చదివినా ఓ పరిషత్ నాటికను చూసినట్లు భావన ఉంటుంది. సహజ ధోరణిలో చక్కని మాటలతో సాగే కథనం ఓ ఆదర్శయానికి దారితీస్తూ సమాజానికి ఓ ఆలోచనను అందించింది. ఈ అద్దంలో కనిపించే ప్రతి బొమ్మ లాంటి ప్రతి కథ అంతర్గతంగా విలువైన అంశాన్ని కలిగిఉండటం విశేషం. నూరుశాతం సమాజానికి, కుటుంబానికి మరియు వ్యక్తుల ప్రవృత్తులకు అద్దంపట్టి, పాఠకులను చదివించి ఓ భావనను హృదయానికి హత్తుకునేలా చేయడం ద్వారా జంధ్యాల వారు అనుకున్న లక్ష్యాన్ని పొందారు. ఈ పుస్తకంలో ఒక్కో కథను పరిశీలిస్తూ ముందుకు నడిచేకొద్దీ ఈ విషయం సుస్పష్టమవుతుంది.

తెలుగు భాషను ప్రాణంగా భావించే ఓ ఆంగ్లోపాధ్యాయుడు వందల మందికి చక్కని విద్యాబోధనతో పాటు మాతృభాషలో ఉన్నత విలువలను భోధిస్తూ, తన జీవితంలో పాటిస్తూ సాగించిన జీవితం గొప్పది. చివరకు పదవీవిరమణ నాటికి తను సంపాదించిన డబ్బుకు పిల్లలను వారసులుగా, తన జీవితకాలంలో కొన్న పుస్తకాలను గొప్ప ఆస్తిగా భావించి తన వద్ద చదువుకున్న పిల్లలనే వాటికి వారసులుగా భావించి, తను ఎప్పుడైనా ఆ పుస్తకాలను చదవాలని ఉంటే నేనే మీ వద్దకు వస్తాను అని చెప్పే రాఘవాచారి పాత్ర ద్వారా సమాజానికి ఓ ఆదర్శయాన్ని పరిచయం చేస్తూ " నవవారసత్వం" అనే కథ ఇచ్చిన చక్కని సందేశం గొప్పది. యూరోపియన్ దేశాలలో ఏదైనా ఒక కార్యక్రమం జరిగితే ఓ పుస్తకాన్ని బహుమతిగా ఇవ్వడం, పుస్తకాల పేర్లను ఇండ్లకు, వీధులకు, బస్,రైలు స్టేషన్లుకు పెట్టుకొని పుస్తకాన్ని నెత్తిన పెట్టుకొని మోయడం జరుగుతుంది. ఈ కథ ఉద్దేశ్యం కూడా అదే. పుస్తకాలను ఆస్తిగా భావించి వాటిని వారసులను ప్రకటించడం ఓ గొప్ప భావన.

మరో కథలో తన ముద్దుల కూతురు "సునిధి" పుట్టిన రోజుకి ఓ గొప్ప కానుక ఇవ్వాలని భావించిన మహేష్ చేసినఆలోచనే " బహుమతి" కథ. ఇందులో తాను ఇచ్చే పుట్టినరోజు కానుక ప్రత్యేక్షంగా తన కూతురుతో పాటు పరోక్షంగా ఎంతోమందికి ఉపయోగపడాలి అన్న మహేష్ ఆలోచన ఓ కొత్తదనంతో పాటు గొప్పదనం. తన కూతురుకు తెలియకుండానే శ్రీశైలంలో ఓ వృద్ధాశ్రమానికి తీసుకెళ్లడం, తన కూతురికి పరిచయం చేసి పుట్టినరోజు దీవెనలందుకోవడం అంతటా జరిగేదే. కానీ అక్కడకు వచ్చేముందే ఆశ్రమంలో "ఈశ్వర్" అనే వక్తితో మాట్లాడిన తరువాత "ఒక వక్తికి తోడులా, నీడలా నిలచి మనసును సంతోషపెట్టేది పుస్తకమని, అది వారికి ఇష్టమైన అంశమని తెలిసి, ముందుగా ఎవరికి చెప్పకుండా అందరికీ ఒక్కో పుస్తకాన్ని తన కూతురు చేత ఇప్పించడం జరుగుతుంది. ఇదే తన కూతురుకు ఇచ్చే కానుకగా పేర్కొనడం విశేషం. ప్రత్యేక్షంగా నాన్న ఇచ్చిన గొప్ప కానుకను మురిసిన సునిధి తన జీవితంలోనూ ఇలాంటి మంచి పనులు చేయదానికి ఇది ఓ పునాది అని చెప్పవచ్చు.

అలాగే మధ్యతరగతి గృహిణి కోరికలకు, లేనిపోని హంగులకు గురయ్యే మనసును ఫలితంగా అనుభవించే ఆర్థిక బాధలకు అర్థంపట్టే కథ " కారు దిద్దిన కాపురం". ఇందులో సుధ జీవితంలో కారు కొనాలన్న బలమైన కోరికను వెలుబుచ్చే క్రమంలో ఇబ్బంది పడ్డ భర్త మనోజ్ తన ఫ్రెండ్ సునీల్ కారును

తెచ్చి సొంతగా కారు కొన్నట్లు నమ్మించి కేవలం పది రోజుల్లో కారు వల్ల ఓ మధ్యతరగతికి వచ్చే కష్టాలను ఆమె గమనించి మనకు కారు అనవసరం అని తెలియడం సుధ ఆలోచనా శక్తికి ఉదాహరణ. ఈ కథలో ఏ వస్తువైన అవసరమైన స్థితిలో మనిషి ఆలోచించాలి.లేనిచో సుధలా ప్రతివారు బాధపడవలిసి వస్తుంది అన్నదే సందేశం ఇక్కడ.

ఉదయం నుండి సాయంత్రం దాకా ఇంటిపనులతొ సతమతమగుచు, అందరికి సేవచేస్తూ బాధ్యతను పలు రూపాల్లో జీవితమంతా మోసే అరుణకు ఓ కొత్త వస్తువును తెచ్చి సంతోషపెట్టాలని చూసిన భర్త శేఖరును మెచ్చుకుంటూనే, ఇంట్లో ఏ వస్తువు తెచ్చినా ఆ వస్తువు వెనుక దాగిన రహస్యం అది ఇచ్చే సౌకర్యం త్వరితగతిన లభించడం ఎవరికి?. ఇందులో వంటగదిలోకి కొత్తగా వచ్చిన నాలుగు బర్నర్ స్టవ్ వలన ఇల్లాలకి సుఖం అని అనిపించినా, దాని ముసుగులో దాగిన సుఖాలన్ని ఎవరివి? అన్న ఓ ప్రశ్నతో ముగిసిన కథతో ఓ సెటైర్ లాంటి సందేశం ఇచ్చింది. "నేను పోరాడవలిసినది ఒక్కొకరితో కాదు మొత్తం సమాజంతో అదే విషయం. నా పుట్టుక నన్ను జీవితాంతం వెంటాడుతుందని తెలుసుకున్న నాకు ఇక దానితో సహజీవనం చేయడమొక్కటే మార్గమని అర్థమయినది" అని శుభాకర్ అనే ఓ దళితుడు ఆవేదనే "టు లేట్"



కథ. ఎన్నో ఏళ్లుగా ఈ స్వతంత్ర దేశంలో ఎప్పుడూ పచ్చగా ఉండే ఓ చేదు నిజం కులం. ఫలితంగా పలురూపాల్లో మనిషిని మానసికమైన వేదనకు గురిచేసే చిరంజీవి వివక్ష. ఓ అద్దె ఇంటికోసం ఎంత తిరిగినా ఇల్లు దొరకనీయని కులాన్ని ఏమి చేయాలి? అన్న ప్రశ్న శుభాకర్ జీవితంలో చేదు నిజాలతో, గాయాలతో సంఘంలో ఈ దుస్థితితో సహజీవనం చేయాలన్న అనివార్యమైన పరిస్థితి నిజంగా ఈ దేశానికి ఓ పెద్ద లోపమే. అప్పటి వరకు రాఘవశర్మ గారింట్లో అద్దెకు ఉంటున్న శుభాకర్ పిల్లల చదువులు కోసం ఇల్లు మారవలసి వచ్చింది. ఇంత కాలం ఎంతో అభిమానంతో కలిసిమెలిసి ఉన్న రాఘవశర్మ గారి స్నేహం ఆదర్శం. కానీ ఇప్పుడు అలాంటి ఇల్లు, అలాంటి మనసులు కోసం ఎంత వెదికినా దొరకని స్థితికి జీవితంలో ఓ అనుభవమే.

ఇలా కొనసాగే కథలో శుభకర్ కు వచ్చిన ఓ గొప్ప ఆలోచన ఈ సమాజానికి ఓ చెంపదెబ్బ. ఎంత తిరిగినా తన కులాన్ని చూసి ఇల్లు ఇవ్వడం లేదని, తాను ఇంతకు ముందు ఏ ఇంట్లో ఉన్నానో, వారితో ఎలా మెలిగామో అన్ని వివరాలను ఓ ఉత్తరంగా వ్రాసి అందరికి పంచడం ఓ చిత్రమైన ఆలోచన. ఈ కథలో ఈ ప్రక్రియ ద్వారా తన నిజాయితితో పాటు, కులం పేరుతో మనుషుల మధ్య దూరాన్ని ప్రశించిన ఆ ఉత్తరం వెంకట్రావు లాంటి వక్తిని "ఇల్లు ఏ కులం వారికైనా అద్దెకివ్వబడును" అని టు లెట్ బోర్డ్ పెట్టించడం ఓ మార్పుకు ఉదాహరణ.

ఈ మార్పులే దేశానికి అత్యసరమైన చికిత్సలు. ఇవే రేపటి రోజులు పట్ల నమ్మకాన్ని పెంచే శుభప్రదాలు. రాఘవశర్మ, వెంకట్రావు లాంటి వ్యక్తులే ఈ సంఘానికి అవసరమగు విలువైన ఆస్తులు.

ఊరిలో ఎవరు చనిపోయినా, తన సొంత "మనిషి" పోయినట్లుగా ఏడ్చే ఈశ్వర్ తన జీవితంలో జరిగిన విషాదాన్ని ఎక్కడ చూసినా ఓ బంధువుగా బాధడటం అందరికి సొంత మనిషిలా భావించె కథ " అందరి బంధువు".

జీవితంలో విధి వశాత్తు బంధాన్ని కోల్పోయి సంఘంలో పిచ్చివాడిగా ఉన్న నారాయణ ఖేమాన్ను ఇంటికి తెచ్చి సాధారణంగా కనిపిస్తూ అసాధారణమైన రచనాశక్తిని, ప్రతిభను గుర్తించి, అతని రచనలను పత్రికలకు పంపుతూ వాటిలో ఉన్న భవనాశక్తి వృధా కాకుండా ఎన్నో రచనలు చేయించి అందరికి ఓ రచయితను పరిచయం చేయడమే " ఇదీ ఒక కథే".

ఇలా విభిన్నమైన మనసులను పాత్రలుగా తీసుకుని పలు రకాలుగా కథను అల్లుతూ, చక్కని ఆదర్శం, సందేశాన్ని ఇచ్చేవే "అద్దంలో బొమ్మలు".

సాధారణ పాఠకులకు సహితం ఓ మంచి నడకను ఇచ్చి, సులభంగా అర్థమయ్యే విధంగా సమస్యను ఎత్తిచూపి,ఆలోచన కలిగేలా చక్కని కథలను అందించారు జంధ్యాల రఘుబాబు గారు. ప్రతి కథలో కుటుంబాన్ని, విలువలను, బంధాలని, గౌరవంగా భావిస్తూ,దీనిపరంగా ముందుగా వ్యక్తిలో మార్పు రావాలని, తరువాత సంఘంలో మార్పు రావాలని ప్రతి కథకు ప్రాణంపోశారు.

అతి సౌకర్యవంతమైన భాషలో, అంత్యంత సులభ శైలిలో పండిన కథను ప్రతివాడు చదివి ఆనందాన్ని మరియు ఆదర్శంగా ఆలోచించడం జరుగుతుంది. అలాగే ఏ కథను తాకిన అందులో కుటుంబనేపధ్యం మనసును అంటి, మనిషి నైజాలను అద్దంపడుతుంది. ముఖ్యంగా ఇప్పుడిప్పుడే రచనలు చేసి కొత్త కలాలకు, ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు, కొద్ది నిడివి గల ఓ మంచి కథల పుస్తకం "అద్దంలో బొమ్మలు"..ఆ బొమ్మలతో పాటు కొన్ని కథలలో తమని తాము చూసుకునే సందర్భాలు ఎదురవ్వడం ఈ కథల పుస్తకం ప్రత్యేకత. ఇలాంటి కథలు వ్రాసిన ఉత్తమ రచయితగా జంధ్యాల రఘుబాబు గారు మరెన్నో రచనలను వినూత్నరీతీలో తేవాలని ఆశిద్దాం..

ప్రతులకు: సాహితీ స్రవంతి
78-117డి, క్రిష్ణానగరు, బి. క్యాంపు పోస్ట్
కర్నూలు- 518 002
సెల్: 9849753298

-చందలూరి నారాయణరావు
9704437247

పుస్తక సమీక్షలు

సిత్ర తేనియలు

బతుకు బాటన భార్యాభర్తలు..
భరోసాతో బయలుదేరెను..
ప్రమాదమని తెలిసినా వారు..
ప్రయాణం చేయక తప్ప కుండెను..

ఊరు ఊరు తిరిగి అమ్మితేనె..
కడుపునకింత కూడు దొరుకును.
కడుపున పుట్టిన పోరగాల్లకు..
కష్టమన్నది తప్పుతుండును..

ఆలు మగలు ఒక్కటవుతనే..
ఈదగలరు సంసారమును..
అపార్థాలు చేసుకున్నచో..
ఆ బంధం చెల్లాచెదురగును..

కలో,గంజో కష్టపడితేనె..
కడుపులోనికి దొరుకుతుండును..
ఆలాంటి శ్రమతత్వముతోనె..
జీవితానికి తృప్తిగుండును..

ఆలుమగలు కలిసి పనిచేస్తే..
ఆయాసమన్నది తెలియకుండును..
కష్ట సుఖాలను పంచుకుంటు..
కాపురాన్ని సాగిస్తువుండును..

-పసుల. శంకర్
9542181301

హైకూలు

అమ్మ మనసు
మమతల గని
తరగనిది.

బీటలు పద్దూ
సమతల సమాజం
మతం మహత్యం.

ఆరేసుకుంటూ
వలువల విలువ
వెండి తెరలు.

ఓటింగ్ మిషన్లో
నేతల రాత రాస్తూ
ఓటరు బ్రహ్మ.

మానవత్వపు
లక్షణాలు ఉండాలి
మానవుడైతే.

మాట్లాడలేవు
పక్షులు-జంతువులు
కల్లలు కూడా.

నోటి దురద
సెల్‌ఫోన్ అతికించు
బిల్లుతో చెల్లు.

మేళం ఒక్కటే
మ్యూజిక్కు మాత్రం తేడా
పెళ్ళి-చావుల్లో.

సొల్లెక్కువైంది
చెవిపోటు గాళ్ళతో
సెల్‌ఫోన్స్ ప్రభావం.

పొలం తెల్లగా
విత్తనాలు నల్లగా
అచ్చు పుస్తకం.

ప్రేమించుతాను
ప్రేమించబడతాను
రెండు గొప్పలు.

గెలుపు కోసం
"శకునుల" గాలింపు
ఎన్నికలలో.

బ్రతుకు రణం
బాల కార్మికులుగా
జీవన పోరాటం.



- బొబ్బిలి జోసెఫ్
సెల్: 9989261991

నానీలు

ఎదుటోడికి
చెప్పేందుకే నీతులు
మన దాకా వస్తే
నీటి పై రాతలు

వార్థక్యం
శాపం కాదు వరం
అనుభవిస్తే
గొప్ప అనుభూతి

నీ సంకల్పం
బలమైనపుడు
నీవు
బలహీనుడివెలా అవుతావ్ ?

మట్టి వాసనకు
అలవాటు పడితేనే
శ్రమైకం
మమేకమయ్యేది

చీకటి,వెలుతుర్లు
ఉన్నంత కాలం
తప్పొప్పులు
ఉండనే ఉంటాయి.

ఓడిపోయావా?
కలత చెందకు
గెలుపుకి అదే
నాందీ ప్రస్థానం

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

అజరామరమైనభాష

గుమ్మపాల మీది తెల్లని నురగవోలె
సరళమైన భాషమనతెలుగు భాష
మెత్తనైన నవనీతమువోలె
కమ్మనిరుచిగలది మన తెలుగుభాష
ఇక్షుకాండరస మాధుర్యమునుమించు
మాధుర్యమొలుకు మన తెలుగు భాష
కవులగంటాన ఒదిగి తళుకు లీనిన
అందచందాల భాష మన తెలుగుభాష
అమ్మగర్భాన నేర్చిన అమృత భాష
అనురాగములు చిలికించు భాష
నాన్న చేతి శిక్షణమువోలె
నిండైన వ్యక్తిత్వ మొనగూర్చు భాష
అక్షరాలుదిద్దించి తలయెత్తుకొనచేయు
గురువువలె గురుతరమైనభాషమనది
గాయకుల గళమందువిరుపుల
కొనలుదేరిసాగి తలలూపు దివ్యభాష
పద్యగద్యాలనాటకాలకు మేటి
వచనకవితల తనకుసాటి పోటి లేదని
కీర్తి గడించినభాష మన తెలుగుభాష
ఏదేశమేగినా ఏప్రాంతీయులైనా
తెలుగుభాషయన్న చేతులు జోడించి
లెస్స యనుచు పలుకు సుందరమైనభాష
విదేశీయులుసైతం అక్షరాలు దిద్ది
తెలుగుభాష ప్రాభవమ్ము మిన్నంట
చాటిచెప్పిన గొప్పభాష మనభాష
అమృతమయము అజరామరమైన
అజంతభాష మన మాతృభాష.

-డా. మైలవరపు లలితకుమారి
9959510422

చైతన్య స్వరంతో రూపుదిద్దుకున్న... ప్రాణగంధం..

శీతాతాపాలను ఎదురుకునే ఒక నులివెచ్చని వాక్యధార.. భూ కాగితమ్మీద రసగీతమై గుండె చెరువు నిండాలె.. నినాదాల కట్టెలు పేర్చుడు కంటే.. పడిపోతున్న ఉచ్ఛ్వాసకు వేడి ఊపిరులూది.. కొత్త నిర్మాణానికి కొన్ని ఇటుకలు పేర్చినప్పుడు మంచి కవితయితది అని భావించే కవి బూర్ల వేంకటేశ్వర్లు "ప్రాణ గంధం" పేరుతో తమ ఐదో కవితా సంపుటిని వెలువరించారు.

వాస్తవాల ఉడుకు మీద.. చిరుజల్లుల పదాలు సుర్రున ఎగిరిపోయినట్లు.. కొద్దిగ సల్లారుతే ఊహల బిందు సందోహాలు గడ్డుక పోయినట్లు.. కవి బూర్ల తమ కవిత్వం నిండా మానవతకు పెద్దపీట వేస్తూ.. ఈ సంపుటిని తీర్చిదిద్దారు. దేశమంతా మతం మత్తుల తగలబడుతున్నప్పుడు...స్మృతులన్నిటినీ కాల్చి.. వాటి బూడిదల మానవతను కలిపి.. బుద్ధునిలా కొన్ని శాంతి కపోతాలను ఎగరేసుకుంటూ.. ప్రేమతో కొన్ని కొత్తదారులను వెతుక్కుంటూ.. తమ భావాలను కవిత్వంలో చోటు కల్పించారు..

'కవిత్వాన్ని నువ్వు రాయలేవు.. తనను రాయించుకుంటుంది కవిత్వం' అని భావించే కవి బూర్ల అగ్నినీ అమృతాన్నీ కలగలిపి.. ఆకాశాన్ని ముడివేసి.. పాతాళాన్నీ స్వర్గాన్నీ తోసేసి.. ఒక వర్ణ ప్రపంచంగా కవిత్వం నిన్ను రాయించుకుంటుందని.. నువు కవివనుకుంటావు. కానీ .. కవిత్వం నిన్ను తన దూతగా భావిస్తుందని తేల్చి చెప్పారు.

బూర్ల కవిత్వంలో ఆయన యొక్క నిజాయితీని అడుగడుగునా చూడగలం.. ధిక్కార స్వరాన్నీ వీక్షించగలం.. అక్షరాలు కవాతు చేసి రాజ్యాన్ని సాధించుకున్నాయి. సరే! ఆ కీర్తి నీదే అయినప్పుడు కిరీటం కోసం ఎదురు చూడ్డం ఎందుకు బంగారు కవీ? అంటూ ప్రశ్నించారు. హృదయ పీఠాలు నీకే.. నీకు అధికార పీఠాలెందుకు సుకవీ అని నిలదీశారు.. బహుజనుల రాజ్యం రాకపోయినప్పటికీ.. రవి కిరణంలాంటి నీ మాట పదును సంకెళ్ళను తెగ్గొట్టింది.. చరిత్రలో నీ పేరు రాస్తిమి.. నువ్వు మెడలో మొట్టెందుకు వేసుకున్నావు రాజ కవీ! అంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సందర్భంలో కవుల పాత్రను ఉన్నతంగా చిత్రిస్తూ.. ఆ తర్వాత కొంతమంది కవులు వ్యవహరించిన తీరు తెన్నులను కవి బూర్ల పై విధంగా ఎత్తిచూపారు. ఎంత ఎత్తుకు ఎదిగినా.. కవులన్న వారు ప్రజల కాళ్ల దగ్గర కిరణమై మెరవాల్సిన వాళ్లేనని విడమరిచి చెప్పారు.

గాలానికి చిక్కిన చేపపిల్ల ప్రాణం ఎట్లా కొట్టుకుంటుందో... అట్లా విలవిల్లాడి రాసినప్పుడే.. కవులు భవిష్యత్తు తల రాత మార్చగలరనీ.. ఆగామి దుర్మార్గాన్ని ఎలుగెత్తి చాటగలరనీ.. వికాసపు శిరస్సు తలెత్తుకు తిరిగేలా నవయుగ సృష్టికి పురుడు పోయగలరని పేర్కొన్నారు. శిథిల విశ్వాసపు శిఖరాల్ని కూల్చి మానవ స్వప్నాలు నిజం చేసే ప్రాణశక్తితో కవులు రాస్తారని భావించే కవి బూర్ల తమ కవిత్వం ద్వారా.. చరిత్ర విషపు నవ్వును తేటతెల్లం చేసి.. వర్తమాన నాటక పూలరంగులను తేల్చేసే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం. బూర్ల.. సమకాలీన సంఘటనలను ఆధారం చేసుకుని.. ప్రజా ప్రతినిధుల డొల్లతనాన్ని.. మసక బారుతున్న మానవ సంబంధాలను ఎత్తిచూపుతూ.. కుల మతాల పట్ల హేతుబద్ధ దృక్పథాన్ని అలవర్చుకుని.. నిఖార్సయిన కవిత్వాన్ని అందించడానికి ప్రయత్నించారు.

మనుషులను మోసం చేసే దేవుడినని ప్రకటించుకోనందుకు నిన్ను ప్రేమిస్తున్నాను బుద్ధా! అంటూ 'ప్రాణ గంధం' శీర్షికతో రాసిన కవితను ఎత్తుకున్న తీరు బాగుంది. బుద్ధా! శాంతివనం విరబూయాలని.. అణుపరిజ్ఞానం మహా పరినిర్వాణం పొందుతున్నది.. గులాబీ మొగ్గల నీ కనురెప్పలు రాల్చిన పంచశీల పుప్పొడి.. ప్రపంచం గుండెల్లో ప్రాణగంధాలు నింపుతున్నదని ప్రకటించడం కవి యొక్క ఉత్తమ వ్యక్తిత్వాన్నీ.. ఆయన సొంతం చేసుకున్న ఆలోచనల స్పష్టతను ఇట్టే అర్థం చేసుకోగలం... మాతృదేవోభవ.. పితృదేవోభవ అన్నోళ్లు రైతుదేవోభవ అని అనట్లేదో గని అతడు దైవ సమానుడంటూ "రైతుదేవోభవ" కవితకు ఈ గ్రంథంలో



చోటు కల్పించారు.

పొద్దు పొడువకముందే ఆకాశాన్ని ముల్లుగ్రతోని ఆడిచ్చే రైతు ఆరాటాన్ని.. అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. రైతు కొన్ని ప్రాణమున్న గింజలు చల్లి.. కోట్లాది ప్రాణాలు నిలుపుతాడని కొనియాడారు. అతడికి గుడి కట్టకున్నా సరే.. కొంత బతుకు నైవేద్యం పెట్టుమనీ.. కొంత బతుకు దీపం పెట్టుమని అభ్యర్థించిన తీరు బాగుంది.

వ్యాపార ఆయుధాల నడుం విరవాలనీ.. అధిపత్య హింసా పైశాచికం అవనిని విడనాడాలని 'విధ్వంసం' కవితలో ఆకాంక్షించారు.

'విగ్రహం' కవితలో.. "పట్టు వస్త్రాలకు ఆశపడే ఫలానా నక్షత్రం కాదనీ.. శాలువా సన్మానాలకు వంగిపోయే నడ్డీ కాదనీ.. పిడికిలై ఆధిపత్యాలను కూల్చే నేత్రం.. చూపుడు వేలై అన్యాయాన్నెదిరించే ధిక్కార స్వరం" అంటూ రాసిన పంక్తులను ఎంతైనా విశ్లేషించుకోవచ్చు..

"పసినవ్వులు" కవిత ఆర్ద్రంగా మలచబడింది. పసి పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై స్పందిస్తూ.. అత్యాచారాలకు ఒడిగడుతున్న కామాంధులను ఏ మానవాతీత చీకటి గోళాల మీద రాకెట్లతో పేల్చేయాలని ప్రశ్నించారు.

పసిపిల్లలురా నాయనా పసిపిల్లలు తరతరాలుగా నిన్ను ఒడిలో చేర్చుకుని.. ముచ్చటించే మీ తల్లులురా.. నాయనా తల్లులు అంటూ మంచి ముగింపునిచ్చారు.

కొండగట్టు మృతులకు నివాళి సమర్పిస్తూ 'పుట్టెడు దుక్కం' కవితను రాశారు. గుండె గుండెనా గుట్టకు పుట్టెడు దుక్కం.. దేవుడు దయ్యమై గావు వట్టిండా? అని ప్రశ్నించారు.

"పూలనవ్వు" కవితలో కవి బూర్ల తమ భావుకతను ప్రదర్శించారు. బతుకమ్మ సంబురాలనుద్దేశిస్తూ.. తొవ్వంతా నెత్తిన పూలనెత్తుకుని నడుస్తున్నది.. బజారంతా బతుకుపాట కైగట్టి అందుకున్నది.. బతుకమ్మ కళగల్ల మొకంతోని నవ్వుతున్నదని చెప్పడం బాగుంది. కట్ల, గుమ్మడి, గునుగు పూల అందాలను అక్షరాల్లో అందంగా ఆవిష్కరించారు. 'బంగారుపూలు" కవితలో.. మట్టి తనువైతే చెట్టు.. మట్టి నవ్వితే పువ్వు.. మట్టి కదలికే ఉయ్యాల అని తేల్చి చెప్పారు. జెండా కవితలో.. ప్రజా తెలంగాణమంటే జెండా నడింట్ల పాతుకునుటానికి గాదు.. నడి బజార్ల ఎగిరేసుకుటానికే అంటూ.. ఉద్యమం నాటి బాసలను ప్రక్కనబెట్టి.. స్వార్థపు బాటను పట్టిన పాలకులపై ధ్వజమెత్తారు. వాగ్దానాలు నీటిపై రాసిన రాతలుగా మార్చి ప్రజలను ఇంకా భ్రమల లోకంలో ఊరేగిస్తున్న ప్రబుద్ధులను ఎండగట్టారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో.. గనులు మనవైతే.. మణులెవరికి? వెళ్తున్నాయంటూ ప్రశ్నించారు. పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ గుట్టలను తొలిచేస్తున్న మాఫియా గాళ్ళపై కవి బూర్ల తమ అక్షరాలను సంధించారు. 'రాయి ముగ్గమ్మా!" కవితలో.. అసలు రాయంతా.. శ్రమ చెయ్యని పరిశ్రమ ఊసరవెల్లుల బొత్తల కిందికి దొబ్బుకునే బంగారి పైస అంటూ వ్యాఖ్యానించారు. 'పదుల తరాల ఆకలితో గొంతు పువ్వొక్కటి వీధుల తిరుక్కుంటూ.. ఎంతకూ అరగని బతుకు రాయిని గిరాకీ సాన మీద పొడి చేసుకుంటూ.. ఊరూరికి సుప్రభాతపు పాట లెక్క వినిపిస్తున్న అభాగ్యుల గురించి ప్రస్తావించిన తీరు బాగుంది. ఇంటింటికి తిరిగి పది రూపాయలకు మూడు డబ్బాల రాయి ముగ్గు అమ్ముతుంటే.. చిత్రంగా అమెజాన్‌ల ఆఫ్ కేజీ రాతిముగ్గు నూట అరవై తొమ్మిది బ్యారమైతదని వాపోయారు.

'ఫేస్‌బుక్ వాల్' కవితలో అంతర్జాలంలో నేడు నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టారు.

'శోభా.భూషణం' కవిత ఎత్తుగడలోనే అతని నవ్వే ఒక భూషణమంటూ గాజోజు నాగభూషణం గారి గురించి రాయడం ప్రారంభించారు. ఇరవై ఐదు ఏండ్ల నాగభూషణం.. శోభ గార్ల దాంపత్య జీవితాన్ని.. వారి ఉత్తమ వ్యక్తిత్వాలను కవితాత్మకంగా తెలియజెప్పారు.

జగిత్యాల పోరాటాల అగ్గిని లోపలికంట నిలుపుకుని.. సమాజమంతా హిమాలయం లెక్క ఉండాలని.. నిత్య పోరాటం చేస్తడని నాగభూషణం ను ఉన్నతంగా చిత్రించారు. సకల మానవ సంబంధాలు కుప్పవోస్తే నాగభూషణం కనిపిస్తారనీ.. నెత్తుటి గాయాల పాటలకు.. ఆరని పదాల ప్రేమ పూత పూస్తే.. ఉరఫ్ శోభా నాగభూషణం అంటూ రాసిన పంక్తులు బాగున్నాయి.

అలిశెట్టి ప్రభాకర్ స్మృతిలో రాసిన కవితలో.. అక్షర సూర్యుడిగా వర్ణిస్తూ రాసిన పంక్తులు చాలా బాగున్నాయి. నీ ముఖచిత్రం.. గాజు కళ్ళల్లో రాజుకొని.. జనారణ్యం అంటుకుని నిప్పుల్లో కడిగిన అక్షరాలే మిగలనీ అంటూ అలిశెట్టి ప్రభాకర్ పట్ల కవి తమ గౌరవాన్ని చాటుకున్నారు.

"దారప్పోగు" కవితలో.. కవి తమ అమ్మా నాయినలు.. మగ్గాన్ని నమ్ముకుని జీవితం గడిపిన రోజులను నెమరు వేసుకున్నారు. మనిషిలోపల జ్ఞానదారాలు.. కండలతో కలిసున్నట్టే.. మనిషి తిత్తి మీద బట్ట పేగులుంటేనే బతుకు అనేటోడు బాపు అంటూ కవి తమ బాల్య జ్ఞాపకాలను మనతో పంచుకున్నారు.

నేతన్నల వ్యథలను తెలియజెబుతూ.. మనిషికి మొలదారం సుట్టనోళ్లు .. ఉరికాళ్లకు వేలాడుతున్నారని వాపోయారు.

"పక్షుల భాష" కవితలో కవి ప్రకటించిన భావాలు చక్కని భావుకతతో రూపుదిద్దుకున్నాయి. పక్షులు ఎగరటం వినోదం కోసం కాదనీ.. పక్షులు మాట్లాడటం వినోదం కోసం కాదనీ.. పక్షులు స్వేచ్ఛను కోరడం వినోదం కోసం కాదనీ.. భాష నీకు భావచిత్రం.. భాష నీకు శబ్దచిత్రం.. భాష నీకు జ్ఞాన చిత్రం.. కానీ.. పక్షులు మాట్లాడుతున్న భాష హృదయ చిత్రమని తేల్చి చెప్పారు.

నిర్విరామ భ్రమణం జీవితమనీ.. నిశ్చల వరణం మరణం అంటూ.. నర్మగర్భంగా చక్కని సందేశాన్ని ఇస్తూ.. 'నిర్విరామ భ్రమణం' కవితను తీర్చిదిద్దారు. 'కడుపుకోత' కవితలో.. మానవత్వం పశుత్వంతో నిలబడదనీ.. పచ్చటి చెట్లలా తలెత్తుక జీవించాలనీ.. తెల్లటి పావురాల్లాగా స్వేచ్ఛగా ఎగరాలనీ.. పరుగెత్తే నదుల్లా ఆటం లేక సాగిపోవాలనీ.. మెత్తటి గాలులాల్ల ప్రతి గుండెలో చేరి పోవాలి మనుషులు అంటూ.. భిన్నత్వం సృష్టిధర్మం.. మమేకత్వం మానవధర్మం అంటూ అన్ని మతాలు ఒక్కటేననీ.. అందరూ కలిసి ఉండాలని ఆకాంక్షించారు.

'ఎర్రబస్సు ఎజెండా' కవితలో తెలంగాణ పాలకుల దమననీతిని ఎండగట్టారు. కార్మికుని ఒంటినిండా సత్యం గల్ల శ్రమ కణాల తెగువ.. పాలకుని ఒంటినిండా వారసత్వ మదగజాల దుర్మార్గాల పోకడ.. ప్రజల కంటినిండా కలలు.. కల్లలౌతున్న రంధి - సందర్భం.. అంటూ కొనసాగించిన పంక్తులు బాగున్నాయి. ఉద్యోగాలకు కొట్లాడిన తెలంగాణ.. ఊడబీకుతే ఊకోదు.. నీళ్ల కోసం నిలబడ్డ తెలంగాణ నీటిమీద రాతల నిలదీస్తది.. నిధుల కోసం వేచిన తెలంగాణ కోటగోడలు కూలగొడతది. ఎర్రబస్సు ఎజెండా ప్రతి పిడికిల్లో సూర్యుడైతది అంటూ ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో దొర కుట్రలను ఏకరువు పెట్టారు.

"ఆమె ఎవరు?" కవితలో ఆమె దేవత కాదు.. ఆమె దయ్యమూ కాదు.. అందాల రాక్షసి అసలే కాదు.. ఆమె సూర్యశక్తిని మింగి.. వెన్నెల చల్లే ఉదార హృదయ... బడబాగ్నిని దాచి.. నవ్వు కెరటాలు రువ్వే శాంతి వర్షస్వి.. పీడనాన్ని భరించి.. సమాజోన్నతికై పైకి లేచి అంతరిక్ష నౌక అంటూ ఒంటిని నమ్ముకుని బతుకుతున్న వారి గురించి అత్యంత ఆర్ద్రంగా ఆవిష్కరించారు. ఇలా ఈ గ్రంథంలో అనేక కవితా పంక్తులు ఉదహరించడానికి యోగ్యంగా ఉన్నాయి. కవి బూర్ల వేంకటేశ్వర్లు తాను చెప్పదలుచుకున్న విషయాలను - తాను ప్రకటించదలుచుకున్న భావాలను నిర్భయంగా, నిజాయితీగా వెల్లడించారు. వస్తు ఎంపికలో వైవిధ్యాన్ని ప్రదర్శించారు. అభివ్యక్తిలో నవ్యతను పాటించారు.

పేజీలు : 167, వెల : రూ. 150/-
ప్రతులకు : బి.సంతోష.. 2-10-1524/10,
ఫ్లాట్ నెం : 403, వెంకటేశ్వరా టవర్స్,
జ్యోతినగర్, కరీంనగర్ - 505 001.
9491598040

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

తేట తెలుగు

(ఇష్టపది మాలిక)

తేట తెల్లని తెలుగు తేనెలొలకెడి తెలుగు
తేటి గములు మీటు తీపి వీణియ తెలుగు

అమ్మ లాంటిది తెలుగు ఆవుపాలే తెలుగు
అజంతంబగు తెలుగు అవనివెలుగే తెలుగు

పద్యమంటే తెలుగు గద్యమంటే తెలుగు
విద్యలన్నిట మేటి విశ్వభాషే తెలుగు

అందమైనది తెలుగు బంధమైనది తెలుగు
ఛందంబుతో కూడి గంధమైనది తెలుగు

ద్వర్థియై,త్ర్యర్థియై ధన్యమైనది తెలుగు
అవధానమలరిస్తు ఛవులూరు ఘన తెలుగు

నన్నయ్య ఘంటమున నాట్యాలు చేసినది
సోమన్న కలములో సోమరసమొలికినది

తిక్కన్న చేతిలో తిరుమంజనముపొంది
ఎర్రన్న కవితలో ఇంపుగా మెరిసినది

అష్టదిగ్గజ కవుల ఆహార్యమై వరలి
శ్రీనాథు గళములో సీసమై పాడినది

బద్దెన్న పద్యముల పెద్ద నీతులు కరపి
వేమన్న సామెతల విశ్వరూపము చూపె

పోతన్న కృతిలోన పోహళించెను శృతిగ
అన్నమార్యుని నోట ఆటాడె పదములై

గురజాడ జాడలో గోదారిలా నడచి
గిడుగు పంతులు చేరి గొడుగునే పట్టింది

-డాక్టర్ అడిగొప్పుల సదయ్య
9963991125

పోరాటమే అందించును ఫలాలు

తిరుగుబాటు చేయకుండనే.
బానిసత్వము దూరంకాదు..
పోరుబాట పట్టకుండనే.
వెట్టిచాకిరి విముక్తి కాదు..

అన్యాయమును చూస్తూ వుంటే..
న్యాయమన్నది నలిగిపోతుంది.
ఎదురుతిరిగి కలబడితేనే.
ఫలితమన్నది దక్కుతుంది..

బతుకు సాగని అనుకుంటే..
బానిసత్వం అలవడుతుంది..
ఫలాలు అందాలనుకుంటే..
పోరుబాట పట్టాల్సస్తుంది..

రాజ్యాలు ఏర్పడుటలోను..
ఉద్యమాలే కీలకాంశము..
ఫలితాలను పొందుటలోను..
భాగస్వామ్యమే ప్రాముఖ్యము..

-పసుల. శంకర్
9542181301

కంటి వెలుగులు!!

ఆ వానకి ఆ చలికి
ఆ గాలికి ఆకలికి
కూలీలలా బతకండే
రోజులెలా గడిపెదరో..?!

ఏ మారినావంటే క్షణంలో
ఏమో జరిగిపోయే మాయ..!
రెప్ప పాటులో చెప్పలేనంత
మోసమే కదా అయోమయా??

నమ్మి మంచి చేద్దామంటే
ఎందుకోయీ వంచన..?
అణువణువూ సమాజం
నిలువాలి నీతి అంచున..!!

ఎంతకూ ఆవేశ పడకు
అయితే గియితే ఏమౌతది?
శాంతి సహనం నీదైతే
క్షణక్షణం సంతోషమౌతది..!!

ఉత్తుత్తి వాటికే చలించి
ఉత్త ఉన్మాదలా మారకు..!
మంచితనం ప్రేమ నింపుకొంటే
అంతా ఆనందం చివరకు..!!

'మా మనం అనుకుంటూనే
మాటకు మాట పెంచుకొన్నారు!
భావాల అనుభవాల నొదలి
అహంభావాన్ని ప్రదర్శించారు!!

కోట్లకు పడగనెత్తెటోళ్ళు
పోటీ వాళ్ళతో లెఖ్ఖా..!
'నువ్వెంతా నేనెంతా" అంటూనే
'అంత చూస్తామంటారు" పఖ్ఖా

-మరికంటి
సెల్: 9640407103

సాధుత్వం

అధికారపు అహం చూపి అణగద్రొక్కినా
విధిగా కారుణ్యపు మేఘమై వర్షించాలని
కరకు మాటల ఈటెలతో గాయపరిచినా
పూరెక్కలంత కోమలంగా పలకరించాలని
వాడుకుని పిప్పి చేసి పారవేసినా
వేడుకుంటూ కాలిగజ్జెలా అంటి ఉండాలని
నవ్వుల పాల్జేసి నలుగురిలో నిలిపినా
పువ్వుల దండలతో సత్కరించాలని
స్వార్థపు చేతలతో గుండె కోత కోసినా
శిరసున మెప్పు కిరీట ముంచాలని
పోలికలతో కొలతవేసి గేలి చేసినా
చెలిమి రంగు నేమాత్రం
వెలువ నీయరాదని
ఉన్నవన్నీ లాక్కుని బోడి చేసినా
ఎన్నక.. మేలు మంత్రజపం మానరాదని..
అంటరానంత దూరాన నిలబెట్టినా
కంటనీరు పెట్టక కొలుస్తూనే ఉండాలని
ఆశిస్తావ్ ఆధునిక సమాజపు
అంతర్భాగమా!
లేశమైనా సాధుత్వం లేని
మానవ రూపమా!
ఎదుటి వారి నుంచి
గులాబీ గుత్తుల్ని మాత్రమే కోరే పువ్వు
హృదయ పూర్వకంగా
కనీస మానవత్వం చూపలేవా?

- ఎస్. కాశింబి
సెల్: 9052216044

పుస్తక సమీక్ష

నవ్య కవన కవితాక్షరి - నవరస కవితా ఝురి

నవ రసాలతో కూడుకున్నది మానవ జీవితం నవరసాలు లేని జీవితం అరసమై మోడువారిన మ్రానులా ఉంటుంది. జీవితంలో ప్రతి మనిషి ఎన్నో భావోద్వేగాలకు లోనవుతాడు. ఈ భావోద్వేగాల ప్రదర్శన ఏదో ఒక రసాన్ని తెలుపుతుంది. మనిషి మనసులోని స్పందనలకు ప్రతిరూపంగా నిలిచే నవరసాలను ఆధారంగా చేసుకుని 20 మంది కవులతో "నవరస కవితాఝురి" అనే సంకలనాన్ని వెలువరిస్తున్నదూడపాక శ్రీధర్ గారికి అభినందనలు. సాహితీ లోకంలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఇది సాహిత్యలోకంలోని సాహిత్యాభిమానులని అలరిస్తుందని ఆశిస్తున్నాను.

"నవ్వడం ఒక భోగం.నవ్వించడం ఒక యోగం. నవ్వలేకపోవడం ఒక రోగం" అంటారు పెద్దలు నవరసాలలో అత్యద్భుతమైన రసం హాస్యం.' 'రసాలేన్నైనా/ రమణీయ కమనీయ రస రాగ రంజని/ మనోల్లాస సుధా తరంగిణి/ అంతేకాదు 40 రకాల ఔషధం" అంటారు శేషం సుప్రసన్నాచార్యగారు. "నెలకొంటే హాస్యం నీలో సొంతం జీవన చిత్రం కాదా స్వర్గం" అని వేణుగోపాల రావు గారు, "జీవన చట్రంలో హాస్యమే ఓ దివ్యాభరణం" రఘు నారాయణ గారు అనగా "నవ్వు నాలుగు విధాల చేటన్నది నాటి మాట /నవ్వకపోతే రోగం అన్నది నేటి మాట'' అని పురం మంగ గారు తెలియపరిచారు. "ఎందరిలో నైనా నిన్ను ప్రత్యేకంగా నిలిపేది హాస్యం" అని అవధానుల గీతారాణి గారు,"సంతోషానికి చిహ్నామైనది, బాధను మరిపించేది, ఆరోగ్యానికి ఔషధం అయినది" హాస్యమని నెల్లుట్ల లావణ్య గారు తెలుపగా "చిరునవ్వు చాలు కదా చితిమంట ఆర్పడానికి" అని ఒమర్ ఎజాజ్ ఖాన్ ప్రకటించారు. ఇంకా వనం సావిత్రిగారు "నవ్వు-నవ్వించు ఆ నవ్వుల ఒడిలో జీవించు"మని ,సాయి బాబు గారు "ఆనందం వల్ల మనసు తేలిక పడుతుంది"ని, గాజుల భారతి శ్రీనివాస్ "దైనందిన జీవితంలో సమస్యలకు చెక్ పెట్టే హాస్యపు కెరటాలు"ని, సరళ శ్రీ లిఖిత గారు "చిరునవ్వు ఒక వరకటం"ని, కమలాకర్ సుజాత గారు "హాస్యం నవ్వుల పువ్వులను పూయించే రసం"ని వివరించారు. "ఉత్తేజాన్ని పెంచి ఆందోళనను దూరం చేసే ఔషధం"ని మాదారపు వాణిశ్రీ గారు, "హాస్యం లాఫింగ్ థెరపీ గా వైద్యంలో సముచిత స్థానం పొందినదని" కామేశ్వరరావు గారు, "నవ్వు పరిమళించే పువ్వులా ఏడుకొండలు గారు, "హాస్య శృతిమించితే అపహాస్యం పాలవ్వక తప్పదు/ హాస్య నికైనా హాస్యంతో చెలగాటమొద్దని" మోతిలాల్ ఆరెకటిక గారు "చిరునవ్వు అంటే మనసు దోసిలిలో కుసుమాలు"ని,కోట లక్ష్మణ్ గారు "హాస్యపు నటభీమ పాకాలు కడుపునిండ పెడ్తాయ్/ సాగర తీరాన ఆహ్లాద గీతాల్లే ముద్దిస్తాయి/ హాస్యపు జాబిలి చల్లదనంతో హృని మురిపిస్తాయ"ని, జక్కని గంగాధర్ గారు "సంసారంలో సమస్యల/ అలలు రావడం సహజం /హాస్యరసం అందించడం చేసుకుంటే/ అన్నీ తేలిక అయిపోతాయ"ని , జువ్వాది సూర్యారావు గారు "మనసులను మురిపించి/ చక్కిలిగింతలు పెట్టే / ఆరోగ్య సంజీవని హాస్యమే"ని సౌదరి మోహన్ గౌడ్ గారు "ముకుళిత మోమును వికసింప జేసే/ జీవకళ నింపును హాస్యపు జల్లులు" అంటూ విభిన్నమైన అభిప్రాయాలను వెలిబుచ్చారు. నిజానికి హాస్యం నేటి కాలంలో అత్యవసరమైన ఔషధంగా పరిగణించబడుతుంది. మనసును ముసురుకున్న సమస్యల వలయం నుంచి బయటపడాలంటే హాస్యమే శరణ్యం. మనిషిలోని బాధను దూరం చేసి, భారాన్ని తగ్గిస్తుంది. నవ్వు మానవుని ఆయుష్షు కూడా పెంచుతుందని అంటారు. అంతటి గొప్ప గొప్ప రసాన్ని కవులు అద్భుతంగా వివరించి చెప్పడం అభినందనీయం.

మానవ జీవితంలో మరొక ముఖ్యమైన రసం శృంగారం. దాంపత్య జీవనానికి మూలం, భార్య భర్తల మధ్య బంధాన్నిపటిష్టం చేసేది శృంగారం. "శృంగారం సృష్టి ధర్మమొక ఆవశ్యక జ్ఞానం/ శృంగారమొక లోక కళ్యాణం యజ్ఞమ"ని శృంగారం



స్థాయిని తెలియపరిచారు చౌదరి మోహన్ గౌడ్ గారు .శృంగారం "ఇరిగి పోనీ హరిచందన గంధం/ మధుర రాగసుధలు చిందు అమృత భాండం" అని జువ్వాది సూర్యారావు గారు తేట పరిచారు. "రాజులు ఏలిన కళ రసరమ్య కళ "అని గంగాధర్ గారు పేర్కొంటే "వయసులో కలిగిన ఈ భావన/కడవరకు నిలిచే అమృత భాండాగారమ"ని కోట లక్ష్మణ్ గారు నిర్ధారించారు. శృంగారం "స్వర్గం అంటే ఏంటో చూపిస్తుంది/ మైమరపించి మత్తు ఎక్కిస్తుంద"ని మోతిలాల్ ఆరెకటిక గారు సెలవియ్యగా ఈతకోట ఏడుకొండలు గారు శృంగారాన్ని చక్కని పదజాలంతో వివరించారు."భార్యాభర్తలను దగ్గర చేసేది శృంగారమా"ని కామేశ్వర రావు గారు, "యువ హృదయాలను మత్తెక్కించే అందమైన కావ్యం"గా మాదారపు వాణిశ్రీ గారు," హృదయాలను ఏకం చేసేటి రసం శృంగార రసమా"ని కమలాకర్ సుజాత గారు, "శృంగారం సృష్టి ధర్మం /సకల చరాచర జీవ రాసులలో/ ప్రకృతి నేర్పే ప్రేమపాఠమ"ని సరళ శ్రీ లిఖిత గారు తమ తమ కవితలలో వారి వారి భావాలను పొందుపరిచారు. గాజుల భారతి శ్రీనివాస్ గారు "దేవకన్య" కవితలో శృంగార రసాన్ని అత్యంత శృంగార యుతంగా కూర్చారు. "బంగారాన్ని మించింది శృంగారమ"ని నల్లి సాయిబాబు గారు పేర్కొనగా "నవరసాలలో మేటి శృంగారం/సృష్టికి మూలం ప్రకృతికి ప్రియమ"ని వనం సావిత్రి గారు తమ కవితలలో పేర్కొన్నారు. అంతు తెలియని మకరంద అగాధమే శృంగార లోయ"ని ఓమర్ఎజాజ్ ఖాన్ హెచ్చరించారు. "భావప్రాప్తులు కలిగించి/ మానసిక ఒత్తిడిని రక్తపోటును తగ్గించే ఘనత /శృంగారరసానిదేన"ని నెల్లుట్ల లావణ్య గారు స్పష్టం చేశారు." ఇరు మనసుల బంధాన్ని/ కంటి చూపుతో మొదలై/ లతలా అల్లుకుపోయే / జన్మజన్మల బంధంగా /మార్చుకునేలా చేసేది"శృంగారమని శృంగార రసం యొక్క లక్షణాన్ని చక్కగా తమ కవితలు నిక్షిప్త పరిచారు గీతా రాణి అవధానుల గారు. "ప్రణయ తీరాలలో హాయిగా/ విహరింప చేయు రాసకేళి"యని పురం మంగ గారు ,"విపరీత ఆలోచనలకు స్వస్తి పలికి/ సదాలోచనల పర్వానికి తెరదీస్తే/బతుకంతా శృంగారమే/ ఆనందాల సమాహారమే''నని రఘు నారాయణ గారు చక్కని సలహానందించారు. "కోన గోట మీటిని చాలు" కవితలో వేణుగోపాల్ రావు గారు రసరమ్యంగా శృంగార భావాన్ని అందించారు." జీవన కడలిని ప్రణయ మంధరంతో మధించి/ ప్రమోద వాహిని దేహమంతా ప్రవహింపజేసి/ చక్కని పంట పొలాన్ని అందించేది శృంగారమం"టూ శృంగార రసాన్ని ఉద్దే శాన్ని చక్కగా వివరించారు శేషం సుప్రసన్నాచార్య గారు. శృంగారంపై చేసిన పరిశోధనలు,మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందని,ఒంటిలో కొవ్వు కరుగుతుందని,తెలివితేటలు కూడా పెరుగుతాయని నిరూపించాయి.ఐతే అన్నీ విషయాలలో హద్దులున్నట్లే శృంగారానికి కూడా హద్దులున్నాయి.వాటిని మనిషి గమనించి మసలుకోవాలి,మనుగడ సాగించాలి.

మనిషిని మనిషి కాకుంటే మరెవరు ఆదుకుంటారు.మనిషిలో కరుణ జాలి దయా గుణాలు నేడు పుష్కలంగా కనిపిస్తున్నాయి. కంటికి కనబడని కరోన చేస్తున్న విలయ తాండవానికి గురవుతున్న ఎందరో వ్యక్తులను ఆదుకుంటున్న సందర్భాలు మనం చూస్తున్నాం.అలాంటి కరుణ రసం గురించి "మనసు చలించి పోయి కళ్ళలో రాలే కన్నీటి చుక్కలే కరుణ హృదయమం" టు సరళ శ్రీ లిఖిత గారు కరుణ రసాన్ని ఆవిష్కరించారు. "హింస దౌర్జన్యాలపై చరమగీతం పాడించు కరుణరసం'' కమలాకర్ సుజాత గారు ."జాలి దయ ప్రేమ కరుణరసానికి రూపాలు అనేకమ"ని మాదారపు వాణిశ్రీ గారు ''కరుణ చూపడమంటే అమృతాన్ని పంచడమే" కృష్ణ కామేశ్వర రావు గారు,"ప్రతి హృదయంలో/ ప్రతి ఉదయం/ ఉదయించాలి కరుణోదయం /కరుణ నిండిన పార్థివదేహం/ కాలుతుంటే కన్నీరు పెడుతుంది వల్లకాడు సైతం" కరుణరసం గొప్పదనాన్ని వివరించే ప్రయత్నం చేశారు ఈతకోట ఏడుకొండలు గారు. ''కరుణ అందరి మన్ననలు పొందుతుంది'' మోతిలాల్ గారు,"మానవత్వమే సహజత్వం అయితే/ శాంతం విశ్వశాంతియై వెలుగొందుతుంది" లక్ష్మణ్ గారు, "కరుణ గల వాడే మనిషి / కరుణ లేని హృదయం పాషాణమే'' గంగాధర్ గారు , "సాయపడే చేతులకు హస్తభూషణం కరుణ/ గాయపడిన బతుకులకు దివ్యలేపనం కరుణ'' కరుణరసం లక్షణాన్ని గొప్పగా తెలియజేశారు సూర్యరావు గారు. "దయామయ మనిషి దేహం దేవాలయం/ కరుణ కలిగిన మనసే దైవం" అంటారు మోహన్ గౌడ్ గారు. "ఆత్మీయులకు ఆమడ దూరమై/జీవచ్ఛవాలు అయినా వారి గుండెలలో/ మమకారపు మాధుర్యమందించాలి" అంటూ చక్కని సందేశాన్ని అందించారు సుప్రసన్నాచార్యగారు. "తరుణము నెంచక కరుణను చూపిన/ ధరణికి నీవే రాజు" వేణుగోపాల్ రావు గారు, "నలుగుతున్న అశేష జనావళి ఆర్తనాదాలకు బాసటగా/ కరుణార్ద్ర హృదయులై కదం తొక్కాలి" రఘు నారాయణ గారు, ''కరుణ దయలు లయలైతే/ మానవీయత కీర్తి శిఖరం అవుతుంది'' పురం మంగ గారు, ''అరిషడ్వర్గాలను దరిచేరనీయనిది కరుణరసం" గీతా రాణి గారు, "కరుణ చూపి ఆదుకోలేని బతుకులు/ అసంపూర్ణ జీవితాలుగా మిగులు" లావణ్య గారు ''సముద్ర తరంగాలుగా ఉప్పొంగి/ కరుణరసం గంగా తరంగాలుగా ప్రవహించాలి" సావిత్రి గారు, "యుద్ధాలు వద్దు శాంతి మనకు ముద్దు" సాయిబాబు గారు "మంచి మనసులు జల్లులుగా కురిసే/ కరుణ రస మమతలు కావాలి" భారతి శ్రీనివాస్ గారు కరుణరసాన్ని తమతమ కవితల్లో చక్కగా పొందుపరిచారు.

ప్రపంచ శాంతి కోసం ప్రతి దేశం ప్రయత్నిస్తున్న తరుణమిది.ప్రపంచం నిత్యకళ్యాణం పచ్చతోరణములా వెలుగొందాలంటే శాంతిని మించిన ఆయుధం మరొకటి లేదు.భారతదేశానికి స్వాతంత్ర్యము తెచ్చిన గాంధీ కూడా పయనించింది శాంతి మార్గములోనే.అలాంటి శాంతరసంపై కవులు స్పందించిన తీరును పరిశీలిద్దాం."శాంతం మన ఆయుధమైతే/ ప్రతి విజయం పాదాక్రాంతం అవుతుంది'' (ఈతకోట ఏడుకొండలు)."నీవు శాంతితో వుంటే/ జగమే మనదే అవుతుంది/ ప్రతి సమస్యపై విజయం నీదే అవుతుంది" (ఆర్య కటిక మోతిలాల్). "మానవత్వమే సహజత్వం అయితే/ శాంతం విశ్వశాంతియై వెలుగొందుతోంది" (కోట లక్ష్మణ్). "శాంతమే సకలానికి సర్వ భూషణం"(జక్కనిగంగాధర్)"సర్వజన హితం,సద్గుణ భరితం/ సర్వ మతాలకు ప్రాణాధారం/ శాంతి సహనం" (జువ్వాది సూర్యారావు)."శాంతం శీత మారుతం/ లాలించి హాయి గొలిపే అమృత గానం" (చౌదరి మోహన్ గౌడ్)."హింసాగ్నిలో రుధిర జ్వాలలు రేపిన/ అశోకుని శోకాన్ని బాపిన/ రస సామ్రాజ్యాధినేత శాంతి" (శేషం సుప్రసన్నాచార్య) "మనసున భావ తరంగ జలధులను నియంత్రిస్తే అదే శాంతము" (వేణుగోపాల రావు). నిర్వహణ సామర్థ్యాన్ని ఇనుమడించే కోణంలో శాంతానిదే అగ్రస్థానం" (పరాంకుశం నారాయణ), "శాంతి లేని బతుకు/ కనిపించెడి శాల్మలి"(పురం మంగ). "నయనాలలో నిర్మలత్వం/మాటలలో కోమలత్వం/చేతలలో మృదుత్వం/అదే శాంత రసం" (అవధానుల గీతా రాణి),"అవరోధాలను అధిగమించుటకు పునాది/ ఆరోగ్యాన్ని సుఖ సౌఖ్యాలను ఇచ్చేవారధి" (నెల్లుట్ల లావణ్య) "శాంతి కపోతాలు రక్షణ చిహ్నాలు" (ఓమర్ ఎజాజ్ ఖాన్), "దైవత్వానికి ప్రతీక/ ప్రపంచానికి బుద్ధుడు చూపిన శాంతి పాట" (వనం సావిత్రి), "యుద్ధాలు వద్దు శాంతి మనకు ముద్దు" (నల్లి సాయిబాబు), "పసిపాప నవ్వంత హాయిగా/తొలకరి జల్లంత చల్లగా" (గాజుల భారతి శ్రీనివాస్), "తన శాంతమే తనకు రక్ష" (సరళశ్రీ లిఖిత) "శత్రుత్వం భావనలు తొలగించి/ రక్షణ కవచమయేటి రసం/ యుద్ధాలు నివారించి/ పరిష్కార మార్గాలను చూపే రసం" (కమలాకర్ సుజాత), "నీవు ఎక్కడ ఉంటే అక్కడ ప్రశాంతం/ సమస్యలన్నీ నిర్మూలనం" (మాదారపు వాణిశ్రీ), "శాంతమే ఆరోగ్యానికి హేతువు/ దివ్యౌషధం" (కామేశ్వర రావు) తమ తమ కవితలలో శాంతరసాన్ని చక్కగా పరిచయం చేస్తూ శాంతి ఎప్పుడూ అభిలషణీయమైనదని నొక్కివక్కాణించారు.

రౌద్ర రసం అన్నివేళలా శుభాలనివ్వదు.రెండు రకాల ఫలితాలనిస్తుంది.అనవసర సందర్భాలలో ఇది చెడు ఫలితాలనిస్తుంది.క్రోదాగ్ని వలన మనిషి ఉచితానుచితములను గ్రహించడు.విచక్షణా జ్ఞనాన్ని కోల్పోతాడు.భంధాలు విచ్ఛిన్నమౌతాయి.మరికొన్ని సందర్భాల్లో పనులు వేగవంతంగా జరుగుతాయి.ఇతరులను ఆధీనములోకి తెచ్చుకోవచ్చు.మరి రౌద్రంపై మన కవుల భావనలేమిటో తెలుసుకుందాం..

"కత్తి లాగా రెండు వైపులా పదునైన అస్త్రం/ ఉపయోగించాలి దీనిని మానవ కళ్యాణార్థం" వనం సావిత్రి గారు, "మనలను వెనక్కు నెట్టి వేసేది రౌద్రం" నల్లి సాయిబాబా గారు, "తన కోపమే తన శత్రువై దిగజార్చును" సరళ శ్రీ లిఖిత గారు "మానవుల మనో నేత్రాన్ని తెరవజాలనీయదు రౌద్ర రసం" కమలాకర్ సుజాత గారు,"రౌద్రం హద్దు మీరితే/ మానవ హృదయమే స్తంభించును/ ప్రజ్వరిల్లితే రాజ్యాలే కూలిపోవును" మాదారపు వాణిశ్రీ గారు"బుద్ధిని నశింపజేసి/ తగ్గిస్తుంది సమాజంలో గౌరవాన్ని" కామేశ్వర రావు గారు, "మరక మంచిదే అన్నట్లు/ రౌద్రం పారద్రోలుతుంది దుష్టులను దుష్టశక్తులను/ రక్షణ కవచంలా మారి" ఏడుకొండలు గారు, "మనుషుల మధ్య దూరాన్ని పెంచుతుంది రౌద్రం బంధాలను విచ్ఛిన్నం చేస్తుంది" మోతిలాల్ గారు, "రౌద్ర రూపాయ,భయానక/ కరుణ చూపి మమ్ము కాపాడుమయ్య/ లక్ష్మీనారాయణ నమో నమః" కోట లక్ష్మణ్ గారు, "రౌద్రం వల్ల ఘణత పోతుంది/ బుద్ధి నాశనం అవుతుంది/ దుఃఖం ఏర్పడుతుంది/ కనపడని కత్తిలాంటి ఆయుధం" జక్కని గంగాధర్ గారు, "రౌద్రం క్షుద్రం సంక్షేమానికి ఛిద్రం/రౌద్రం విడనాడితే సమాజక్షేమం భద్రం"జూవ్వాది సూర్య రావు గారు, "ఇరువైపులా పదునున్న వీర ఖడ్గం/ యుక్త వాడకంలోనే ఉంది మానవ జాతి హితం" సౌదరి మోహన్ గౌడ్ గారు, "దుష్ట శిక్షణకు శ్రీకారం చుట్టి/ వైరి వర్గాలపై కాలు దువ్వుతూ/ అలరారే అనుపమానం రసమే రౌద్రం" సుప్రసన్నాచార్య గారు, "అన్యాయాలను అక్రమాలను అధర్మాలను అహంకారమును అణచివేయుటకు ఆఖరి అస్త్రం రౌద్రం" వేణుగోపాల రావు గారు, అమృత కలశంలో పడిన ఓ విషగుళిక వోలె/ రౌద్రం ఆవహిస్తే అంతా శూన్యమే/ జీవన పరిపూర్ణత్వం బూడిదలో పోసిన పన్నీరే" రఘు నారాయణ గారు, "సామాజిక సమస్యలపై ఊపునిచ్చే ఉతమవ్వాలి" పురం మంగ గారు. "అన్యాయాన్ని సహించని తరుణాన / ప్రళయకాల రుద్రుని మరో రూపమై / దుష్టులను తుదముట్టించు వేళ/ రౌద్రానికే ప్రతి రూపం/ స్త్రీ ఆదిశక్తి రూపం" అవధానుల గీతారాణి గారు, "సమాజానికి చెదలు పట్టించే /దుష్టుల శిక్షణకు రౌద్రాకారం తోడ్పడును" లావణ్య గారు "న్యాయం జరగని పక్షంలో సమాంతర న్యాయం కోసం/ కొత్త రూపం దాల్చింది రౌద్రం" ఎజాజ్ ఖాన్ గారు తమ తమ విలువైన ఆలోచనలను అందించారు.

"భయాన్ని పారద్రోలితే/ గెలుపు బాట సులువేగా" పురం మంగ గారు పేర్కొంటే "భయం కలతలకు కారణం ఆరోగ్యానికి హానికరం/ మనలోని ఉత్సాహాన్ని కుంగతీయన"ని లావణ్య గారు "కూటికి లేని ఆ క్షణంలో కాటికి ప్రయాణించడమే భయానకం" ఎజాజ్ ఖాన్ గారు, "భయం గుప్పిట్లో మనిషి బ్రతుకుతున్నాడ"ని నల్లి సాయిబాబు గారు, "భయానక బడబాగ్ని ఎత్తుకొని ఏడవడం ఎందుకు /చిరునవ్వుల సుధలు కురిపించి పయనించు/ తొణకని బెనకని స్థితప్రజ్ఞతో జీవించు" గాజుల భారతి శ్రీనివాస్, "అపజయాలకుమూలమైనది భయానక రసం" కమలాకర్ సుజాత గారు, మనిషిని మానసికంగా/క్రుంగదీసేది భయానక రసమే/ మనలోని బలహీనతా రూపమే భయం" కామేశ్వర రావు గారు, అణువంత కణంతో/ ఆరడుగుల మనిషి పోరాటం రణం/ చావు బ్రతుకుల మధ్య బ్రతుకంతా భయానకం" ఏడుకొండలు గారు, "ప్రతి ఒక్కరికి అతి భయంకరమైన వ్యాధి /నీలోని భయం" మోతిలాల్ గారు. "ఊహించని వేళ ఊహించని విధంగా / ఊహించని సంఘటన ఒక భయానకం" కోట లక్ష్మణ్ గారు. "తప్పుడు పనులే భయానికి కారణాలు" గంగాధర్ గారు, "సజీవ సమాధికి పునాది తీసే /కల్లోల సునామి/ అతి భయానకం" సూర్య రావు గారు, "కలలో సైతం నీడలా వెంటాడే ఫ్రేతికం/ మనిషి జీవితంలో భయానకం" మోహన్ గౌడ్ గారు, "జిహ్వ తడీయారీ తల్లడిల్లడం / చంచల సహిత హరి నేత్రాలు/ తాండవిస్తూ దృక్కులు జారిపోవడం'' సుప్రసన్నాచార్యులుగారు,ఇంకా వేణుగోపాల రావు గారు మాదారపు వాణిశ్రీ గారు సర్వశ్రీ లికిత గారు వనం సావిత్రిగారు గీతా రాణి గారు తదితరులు తమ కవితలలో భయానక దృశ్యాలను వివరించారు

నవరస కవితాఝురి సంకలనంలో అద్భుత రసాన్ని కవులందరూ చాలా అద్భుతమైన చిత్రాలతో దృశ్యాలతో తమ కవితలను పండించారు.''ధరిత్రీజనని దేహావయవములై /కాంతిల్లే శైల సంపద ఎంతద్భుమము" సుప్రసన్నాచార్యులు గారు, "ఏడు రంగుల ఇంద్రధనస్సు నీలి నింగిన అద్భుతం/ గతము మరచి ఘనతలు పలికే నరుడి నటన అద్భుతం" వేణుగోపాలరావు గారు, "మనిషి మేధోమథనంతో సాధించిన శాస్త్రీయ అభివృద్ధి అనన్య సామాన్యం" రఘు నారాయణ గారు, "గిజిగాడి గృహ నిర్మాణం ఓ అద్భుతమే" పురం మంగ గారు, "ఆస్వాదించే మనసు/చూసే కనులు ఉండాలేగాని/ ప్రకృతిలోని ప్రతి అణువు అద్భుతమే" గీతా రాణి గారు, "మదిలో మెదిలే చక్కని భావాలతో రాసే కవనాలు అద్భుతాలే" లావణ్య గారు, "శిశువు జననం/ మనిషి మరణం/ మధ్య జరిగే వింత నాటకం/ అద్భుతం అద్భుతః" వనం సావిత్రి గారు, "మనిషి పుట్టుకే ఒక అద్భుతం" నల్లి సాయిబాబు గారు, "ప్రతి నిమిషం/ బహుమతిగా ఇచ్చిన ప్రకృతి అంతా/ అద్భుతమే "భారతి శ్రీనివాస్ గారు, "అమ్మ లాలి పాట/ ఆకాశంలో జాబిల్లి/ వీచే గాలి కాచే వెన్నెల/ పూచే మల్లెలు / ఎగిసే అలలు/ ఓ అద్భుతం" సరళశ్రీ లిఖిత గారు, "శ్రమైక జీవనంలోనూ దాగుంటుంది అద్భుత రసం/ మోడు వారిన జీవితాల్లో వసంత ఆగమనం అద్భుత రసం" కమలాకర్ సుజాత గారు, "పుట్టిన బిడ్డ కేరుమన్న శబ్ద తరంగంతో/ తల్లి కళ్ళలో మెరిసే మెరుపు కదా అద్భుతం" మాదారపు వాణిశ్రీగారు, "కొండలు కోనలు సెలయేళ్ళు/ హరిత వనాలు పక్షులు జంతువులు/ఉదయాస్తమయ సూర్యబింబాలు/ చిన్నారి ముద్దు ముద్దు మాటలు/అన్ని అద్భుతాలే'' కామేశ్వరరావుగారు, "ఆయుర్వేద మందు కనిపెట్టి /ఆలోపతికి షాక్ ఇచ్చిన / ఆనందయ్య అద్భుతం మహా అద్భుతం" ఏడుకొండలు గారు, "దివినుండి భువికి వెలుగును పంచే/ సూర్యచంద్రుల వెలుగురేఖలు అద్భుతం" మోతిలాల్ గారు, "బోసినవ్వుల పాపాయి కేరింతలు/ సొగసైన అమ్మాయి తుళ్ళింతలు/ తొలకరి వాన వింతలు/పారే సెలయేరు కవితలు" కోట లక్ష్మణ్ గారు, "కళాకారుడు చిత్రవిచిత్రాలు/ క్షణాల్లో గీయడం అద్భుతం''జక్కని గంగాధర్ గారు, "మనసుకు చెవులు ఉంటే/మదినిండా రసమయ సంగీతమే/మౌనంగా వినిపించును/ మౌన రాగాల సంకేతమే" జువ్వాది సూర్యారావు గారు, "అప్పుడప్పుడు తళుక్కున మెరుస్తాయి/ సప్త శత సహస్ర నాదులని ఉత్తేజపరుస్తాయి/ చేష్టలుడిగించి అబ్బురపరిచే ఘటనలు" సౌదరి మోహన్ గౌడ్ గారు.ప్రపంచంలో ప్రతీదీ అద్భుతమే.దృష్టిని బట్టి ఒక్కొక్కరికి ఒక రకంగా కనిపించవచ్చు.కానీ ఈ ప్రపంచం మనిషికెప్పుడు గొప్ప అద్భుత భాండాగారం.అంతు తెలియని అగాధం.

వీరరసంలో కవులు స్వాతంత్ర్యము కోసం పోరాడిన వీరులను, వీరనారీమణులను, వీరమాటలను స్మరిస్తూ వీరరసాన్ని తమ రచనలలో చక్కగా పొందుపరిచారు. శివాజీ, రాణాప్రతాప్, రుద్రమదేవి, ఝాన్సీరాణి, బాలగంగాధరుడు ,పృథ్వీ రాజు,సుభాష్ చంద్రబోస్ గాంధీ,పటేల్, నెహ్రూ,పంచపాండవులు,అల్లూరి సీతారామరాజుల పౌరుషాలను,దేశరక్షణకై నిలిచిన వీరజవానులను ,వీరుల పోరాటాన్ని, విశదంగా వివరించారు."నిబ్బరమైన శౌర్యమే/నిరంతరం నిప్పులా/నిలబెడుతుంది గొప్పగా"యని పురం మంగ వీరత్వమంటే ఏమిటో మనముందుంచారు."పౌరుషాగ్నికి ప్రతీకం వీరరసమని'' కమలాకర్ సుజాత,"నాటి రాజ్య పాలన అయితేనేం/ నేటి దేశ పరిపాలన అయితేనేం/వీరత్వం నిండిన ధీరులతోనే కదా సాధ్యం"మా దారపు వాణిశ్రీ తెలిపారు. "వీరత్వాని విజయానికి తొలి అడుగు/వీరత్వం నీ గుండె ధైర్యానికి /మేలుకొలుపు"అంటారు మోతీలాల్ గారు. "నేడు మన అనుభవిస్తున్న సువిశాల విశాల భారత దేశం ఎంతో మంది వీరుల త్యాగఫలమే"నని సుప్రసన్నాచార్యులు వీరరసం విశిష్టతను మనముందుంచారు.

బీభత్సం పలు హృదయవిదారక దృశ్యాలతో ఆవిష్కరిస్తూ మనలో కొంత ఆలోచనలను,మార్పునకు శ్రీకారం చుట్టారు. "గర్భసంచిలో ఆడశిశువని తెలిసి చేసే భ్రూణహత్యల కోతల రోత" సాంకేతికంగా ఎంత సాధించినా ఇంకా ఈ దుశ్యాలు మనల్ని వెంటాడుతున్నాయని సుప్రసన్నాచార్యులు సమాజాన్ని ప్రశ్నిస్తున్నారు.మనిషి చేసే తప్పులవల్ల జరిగే విపరీత పరిణామాలను పురం మంగ గారు "కోవిడం"లో వివరిస్తే,పర్యావరణ పరిరక్షణను మనం బాధ్యతగా స్వీకరిస్తే, ప్రకృతిని కాపాడుకుంటే భీభత్సమైన దృశ్యాలు కనిపించవని, ధైర్యంతో, మానవత దృక్పథంతో మనిని ఎదుర్కోవాలని ఈ సంకలనం లోని కవులందరూ ఏకాభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

ఒక కొత్త ప్రయోగంతో మనముందుకు వస్తున్న నవరస కవితాఝురిని ఆదరిద్దాం,సంపాదకులు దూడపాక శ్రీధర్ ని అభినందిద్దాం.

ప్రతులకు :
దూడపాక శ్రీధర్ కవి,చిత్రకారుడు
గ్రామం : కూచిరాజ్ పల్లి,
మం: మంథని జిల్లా: పెద్దపల్లి
తెలంగాణ 505184
చరవాణి: 9666375277

-డా వైరాగ్యం ప్రభాకర్
9014559059

జర భద్రం మానవా !

ఒంటరిగా భూగోళాన్ని
హస్తాల్లో బంధించానని
గుప్పెట అంతర్జాలంతో
కుప్పిగంతులేస్తూ
నింగిపైకెగిరానని
చంద్రమండలం చుట్టేసానని
మురవకు మానవా !

మట్టే మానవ జన్మకు మూలమని
పర్యావరణమే నీలోచేతనత్వమని
మరణానంతరం మానవ సంతతిని
తనలో విలీనం చేసుకొనే ఆవరణమని
జడత్వాన్ని జాగృతంచేసే
అత్యద్భుత జీవరాసుల నిలయమని
జ్ఞాన సంపత్తినందించిన అత్యద్భుత
పంచభూత సమ్మిళిత మిశ్రమమని
మరవకు నాగరికా !

సమతుల్యతను కాపాడక
ఆయువు పట్టైన పచ్చదనానికి
గొడ్డలి పెట్టైన నీ అభివృద్ధి కాంక్షపై
ప్రకృతి కన్నెర్రజేస్తే సాగరాలన్నీ ఉప్పొంగి
యుగాల మానవ మనుగడ
రగిలే అగ్నిగుండంలో
భస్మీపటలం కావడం క్షణంలో పనేగా

అందుకే మానవా !
ధరిత్రి భద్రతకై మానవ కళ్యాణానికై
ప్రేమ పూరిత సామ్రాజ్య స్థాపనకై
నడుం బిగించాలి
కలిసికట్టుగా అడుగేయాలి.



-దాసరి నాగభూషణం,
8096511200

కార్పొరేట్ చదువు!

అనుభూతులను బంధించాం!
మాటలకు పాతరేసి
పాటలను ఎక్కడో దూరంగా విసిరేశాం!
ఆటలకు మైదానంలోనే ఘోరీ కట్టేశాం!
కార్పొరేట్ కబంధ హస్తాల్లో
విద్యఎలా ఉండాలో నిర్వచించేశాం!
చదువు హాయిగా సాగుతోంది!?

స్టడీ మెటీరియల్ ఎరువుల్తో
ప్రపంచీకరణ గంజాయి మత్తును పండిస్తూ
మొద్దుబారిన మెదళ్ళను
స్టడీ అవర్స్ తో చిగురింపచేస్తున్నాం!
రోజూ స్లిప్ టెస్ట్ లతో
పెన్నుల్ని సైతం విరిచేస్తున్నాం!
చదువు చాలా ప్రశాంతంగా సాగుతోంది!?

ఎవడు ఏమైతేనేం
ఎవడు ఏమనుకుంటేనేం
ఆఫ్ లైన్...ఆన్ లైన్ ఏదైనా సరే...
ఇటు ఫీజుల మోత
అటు హక్కుల అణచివేత
రెండూ మా హక్కులే!
చదువు చాలా సుభిక్షంగా సాగుతోంది!?

-డాక్టర్ మస్నా వెంకటేశ్వర్లు
8897972070

నేను ?

నేనొట్టి మనిషినే అనుకున్నాను
పరాన్న జీవినై రక్తమాంసాలు పీల్చుకు
ఉమ్మనీటిలో ఊపిరిపోసుకున్న నేను
మనిషిననే అనుకున్నాను
కాదని ఇప్పుడిప్పుడే తెలుస్తోంది
ఎప్పుడో ఏ నదీ తీరాల్లోనో , సెలయేటి గుసగుసల్లోనో
పారేసుకున్న క్షణాలు
పుట్టక ముందు నుండీ సేకరిస్తూ
మనసుకు వేలాడదీసుకున్న జోలె నింపుకునే
ప్రక్రియలో ఇప్పుడిప్పుడే
కాస్త కాస్త వెలసిపోతున్న సతత హరిత పొలాన్నినీ
ఎక్కడో అపరిచిత పరిసరాల మధ్య అనామకంగా
హఠాత్తుగా పుట్టి
సాగి సాగి మరెక్కడో విస్తరించిన సముద్రమై
పరవళ్ళు రవళించే జల ప్రపంచాన్ననీ..

మనిషినని అనుకున్న జీవితపు యుగాల్లో
అనుక్షణం క్షణికపు ఆర్భాటాల చిత మమతల మధ్య
ఎప్పుడో యుగాలక్రితపు భావవిస్ఫోటాల ఫలితమై
ఇప్పటికీ ఆదిమ జాతి వాసనలు కొంగున కట్టుకు
డార్విన్ సిద్ధాంతాల మధ్య, పరస్పర సంఘర్షణల మధ్య
తరతమ తారతమ్యాల మసక చీకట్లలో
నాది కాని సౌఖ్యాల వేటలో నన్ను నేనే వదులుకున్న
వైరాగ్యపు గుడ్డి చూపులో .....

ఇప్పుడు ఇక్కడ
భూగోళానికీ ఖగోళానికీ సఖ్యత కుదిరిన సమయాన
కాస్సేపు హరివిల్లు రంగు సముద్రాలలో ఈది ఈది
మరికాస్సేపు అసురసంధ్య నిసర్గ నైరూప్య సౌందర్య
సీమల కడదాకా విహరించి
మధుపాన్నై పీయూషాన్ని మనసారా తాగి తాగి
కళ్ళు మూసినా తెరచినా
అణువణువునా నేనై ఉన్నప్పుడు
మనిషినా నేను ?



-స్వాతీ శ్రీపాద
8297248988

సమ్మోహనాలు

పొగడపూ పద్యాలు
పద్య పదబంధాలు
ప్రబంధ గంధాల పరిమళించు
మన తెలుగు...!

జాను తెనుగు పలుకులు
పలుకులు రాచిలుకలు
చిలుక పలుకులంటి
తీయదనము మన తెలుగు...!

బాపు గీసిన గీత
గీతామృత పునీత
పునీత చరితల ఘనత
మన తెలుగు...!

గోరేటి పాటలో
పాటల్లో పదములో
పదములందు మధురిమ
ధ్వనించును మన తెలుగు...!

జాజిమల్లె జావళి
జావళీలో రవళి
రవళించు సరిగమల సంగీతం
మన తెలుగు...!

త్యాగయ్య రాగము
రాగరమ్య గానము
గానామృత కీర్తనల రంజిలు
మన తెలుగు...!

తీయ తేనియ తెనుగు
తెనుగు ఉదయపు వెలుగు
వెలగాలి పరభాషల నడుమన
మన తెలుగు...!

కమ్మనైనది తెలుగు
తెలుగు కవిత్వ జిలుగు
జిలుగు వెలుగుల మెరిసే
ముత్యం మన తెలుగు...!

విశ్వనాథ పద్యము
పద్యమెంతొ హృద్యము
హృద్యమైన పద్యముల పెన్నిధి
మన తెలుగు...!

నుడికారముల సొబగు
సొబగు పదముల మెరుగు
మెరుగు అలంకారముల
వెలుగు మన తెలుగు...!!!

-చంద్రకళ. దీకొండ,
9381361384

పల్లె పిలుస్తోంది

పచ్చని పల్లె వదిలి
బస్తీ వాసం చేస్తున్న ఓ మనిషి
తిరిగి నీ ఇంటికి ఎపుడు చేరతావు.

నీ కళ్ల లో ఇపుడు ఆ వెలుగు ఏది
నీ కళ్లలో ఇపుడు పట్నవాసం పోకడ
నీ మనసు వేరు నీ మమత వేరు
ఇపుడు కేవలం ధన వ్యామోహం

ఇపుడు నువ్వు నువ్వు కాదు.

నువ్వు ఉండే పట్నంలో
వెండికి బంగారానికి బదులు
అమ్ముడు పోతున్నాయి మనసులు
పచ్చని పల్లెలో మనసు నిండుగా ప్రేమలు
విశాలాకాశంలో చల్లని చంద్రుడు నక్షత్రాలు
అందమైన వెన్నెల రాత్రి అడుగుతోంది
తిరిగి నీ పల్లెకు ఎపుడు వస్తావు.

పల్లె జ్ఞాపకాలు మనసు నిండా
అశ్రువులు కనులనిండా
పట్టు పరుపు పై కూడా నిద్ర కరువైంది

మనసుకు నచ్చచెప్పే శక్తి నశించింది
వివేకం నశించింది.

అవే దారులుఎవారే బాటసారులు
ఒక నక్షత్రం ఎటో వెళ్లిపోయింది
అదే ప్రపంచం, అదే మనుషులు
ఒకరి జీవితం తుఫాను లో చిక్కిన
నావలా అయ్యింది
ఓ బాటసారి పల్లె పిలుస్తోంది

-అరుణ డేనియల్
9000606889

జ్ఞానదీపిక

అక్షరాలను ఊపిరిగా మలచి
మట్టిబిడ్డలను మాణిక్యాలుగా తీర్చిదిద్దే
,
సంసార సంద్రాన్ని మథనంగావించి
జ్ఞానామృతాన్ని పంచే
దైవస్వరూపం-గురువు.
కరడుగట్టిన కసాయి గుండెను సైతం
కారుణ్య నిలయంగా నిలిపే
కరుణాసింధువు-గురువు.

అజ్ఞాన పురుగ్మతలను రూపుమాపే
ఔషధజ్ఞాన భిషక్కు -గురువు.
సుస్వరాల సాహిత్యంతో
మనిషిని మనీషిగా మార్చే
సరస్వతీ స్వరూపం-గురువు.
సమస్యల సుడిగుండంలో
సతమతమవుతున్న వేళ
మార్గదర్శనం చేసే దివ్య దిక్సూచి-గురువు.
పసిమొగ్గలకు ప్రాణం పోసి
పరిమళాలను ప్రసాదించే

పరబ్రహ్మ-గురువు.
జాతిని జాగృతపరచి
పునరుజ్జీవింపజేసి
మహాసంస్కర్త-జ్ఞానదీపిక-
జాతి పతాక-భావినిర్మాత అయిన
మహాగురువుకు
మనసారా వందనం
కృతజ్ఞతాభివందన చందనం!!

- రేణుకా గంగాధర్
7780642389

గురుభ్యోనమః

జన్మ నిచ్చి మనలను లోకానికి
పరిచయం చేసిందిఅమ్మానాన్నలు
గుండెలో దాచుకుంటూ
వేలు పట్టుకుని తప్పటడుగులు
ముద్దు మాటల మూటల్ని
నేర్పించిన మొదటి గురువులు !

బడిలో ఓనమాలు దిద్దించి
అక్షరాల అందమైన
తొడుగులతో పరిమళాల
అడవులను దాటిస్తూ
పదాలను, పద్యాలను, పాఠాలతో
ప్రపంచం గుట్టు విప్పి

మనకు మనో నేత్రాన్ని అందించిన
జ్ఞాన ప్రధాతలైన గురువులకు
వరుసగా పాదాలకు మొక్కాలి !

ఎదిగే మనలో భాషతో పాటు
పురాణాలు,నీతి కథలు,
శాస్త్రవిజ్ఞానాన్ని,పదార్థరహస్యాల్ని
విప్పిచెప్పి మనల్ని ప్రయోజకులుగా
తీర్చిన ప్రతి అధ్యాపకుడికి
వినమ్ర ప్రణామాలు చెప్పాలి !

మన చుట్టూ ఉండి మనల్ని
తమ అనుభవాలతో లోకాన
మనుషులుగా మలచిన ప్రతి
ఆత్మ బంధువును కూడా
గురువుగా నమస్కరించాలి!
నేటి విషవ్యాపార సంస్కృతిలో
తమను తాము కాపాడుకుంటూ
నిస్సహాయతలోనూ విలువలను
మనకు చెరగని కవచాలుగా కప్పి
లోకం పద్మవ్యూహంలో
మనల్ని విజయుల్ని చేసి
మన వృద్ధికి బాటలు వేసి
విశ్వమంతా విస్తరించిన
ఆ గురువులే లేకుంటే మన
నేటి ఉనికిని ఊహించగలమా ?
అందుకే కనీసం నేడైనా
మన గురువులను
స్మరించుకుందామా!



-డా. కె. దివాకరా చారి
9391018972

హైకూలు

అఫ్గాన్ లో
ఎన్ని దుఃఖనదులో !
స్వేచ్ఛకు ఉరి

కుటుంబంలో
నవ్వులు పండాయి
నది నాన్నే

అతనిప్పటికీ
దుఃఖనదిలోనే
రైతు కదా!

ఎండిన నది
మళ్లీ ప్రవహించింది
ఆమె చెంపలపై

ముఖమంతా
నవ్వులు పూయించింది
జ్ఞాపకాల నది

నది రాకతో
సముద్రుడు బతికాడు
దాహం తీర్చిందిగా !



- నరేశ్ చారి
9701334516

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.